# సమర్థ సద్గురు


ఆధ్యాత్మిక మాసపత్రిక



శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ : (0863) 2293280, 2293564, 2293206
web: www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము
గూడూరి వెంకటరత్నం
డి.జె. బాలకృష్ణ లాల్
డా॥ ఎన్.రామతారక పరబ్రహ్మశాస్త్రి
మిస్.పి. ఇందిరాదేవి
జి.ఎన్.ఆర్. మూర్తి
డా॥ వి.వి.ఆర్. ప్రసాదరావు
డా॥ యమ్.స్వర్ణముఖి



Volume 29 Issue 8
No.of Pages 40
APRIL 2010

| | | |
|---|---|---|
| 5సం॥లచందా | రు. | 250.00 |
| 2సం॥ల చందా | రు. | 120.00 |
| సంవత్సర చందా | రు. | 60.00 |
| విడిప్రతి వెల ..... .. | రు. | 5.00 |

బ్యాంక్ డ్రాఫ్ట్A/C.Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరులో డ్రా చేయండి. M.O.,బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా:
మేనేజరు
సమర్థసద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్-522508

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - Guda Siva Rama Murthy,


## ఈ సంచికలో.... 


| ఈ సంచికలో.... | పేజీ |
|---|---|
| శ్రీ మాతాజీ ఉగాది సందేశము | 2 |
| భద్రవాక్యం | 4 |
| అమ్మఆశీస్సులు | 5 |
| సంపాదకీయం | 6 |
| బాబూజీ ఉవాచ | 7 |
| మాతాజీఅభిభాషణ | 10 |
| సన్నిధిలోసంభాషణ | 13 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 15 |
| సత్సంగసౌరభం | 16 |
| సంత్‌నామదేవ్ చరితామృతం | 19 |
| శ్రీకృష్ణతత్వము ప్రేమయోగము | 22 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 24 |
| మౌనధ్యాన సప్తాహ శిబిరం | 26 |
| మాతాజీ బోధామృతం | 28 |
| మాతాజీ సత్సంగ్ డైరీ | 30 |
| శ్రీబాబూజీ దివ్యవాణి | 33 |
| సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర | 35 |
| శ్యామసుందరా! ఒక్కసారి! | 38 |

# శ్రీ మాతాజీ ఉగాది సందేశము

కాలగమనంలో అందరికీ సంవత్సరాది ఒకే రోజున ఉండదు. మనం తెలుగువాళ్ళం కనుక ఈ రోజు తెలుగు సంవత్సరాది అనుకుంటున్నాము. మనం కాలగమనం అనే శక్తిని ఆరాధిస్తున్నాం. కాలోస్మి అంటాడు భగవంతుడు భగవద్గీతలో. భగవత్తత్వాన్ని మనమే అని గుర్తిస్తే మనకి తృప్తి కలుగుతుంది.

ఈ రోజు నుండు వికృతి. విరోధి పోయింది. మనకి ఎవ్వరితోను విరోధం లేదు. ఎవరి మనస్సు వారికి విరోధం అవుతున్నది. మనస్సు మన మాట వినకపోతే మనోవ్యధ కలుగుతోంది. ఆ మనోవ్యధను పోగొట్టటం ఒక్క గురుదేవునికే చెల్లు.

కాలం దానంతట అదే వెళ్తోంది. మనం కేవలం సాక్షిగా చూడటం మాత్రమే చేయగలం. మనకు పగలంటే ఇష్టం కనుక ఎప్పుడూ పగలే కావాలనుకొంటే అది సంభవమా? జీవితంలో అనేక సుఖదుఃఖాలు వస్తూ పోతూ ఉంటాయి. దానికి చిహ్నమే మన ఉగాది పచ్చడి. అది పుల్లగా, చేదుగా, కారంగా, వగరుగా ఉంటుంది. ఇంతలో బెల్లంగారు వస్తారు. అలాగే పంచభూతాలతో, పంచ కర్మేంద్రియాలతో, పంచ జ్ఞానేంద్రియాలతో, పంచ వాయువులతో అంతఃకరణ చతుష్టయంతో ఏర్పడిన జీవితాన్ని గడుపుతున్నాము. ఈ ఇరవైనాలుగు తత్వాలు దాటిన తరువాత ఉండే తత్వమే 'తాను'.

జీవితంలో వచ్చే సుఖదుఃఖాలను గుర్తు చేయటానికే అన్నట్లుగా సంవత్సరం ఉగాది పచ్చడితో మొదలౌతుంది. మనం ప్రకృతిలో ఉన్నాం. దానికి వ్యతిరేకం వికృతి. శరీరానికి సంబంధించినది ప్రకృతి. దానికి విలక్షణం వికృతి, అంటే పరబ్రహ్మమే.

ఈ శ్రీ వికృతి నామ సంవత్సరంలో శ్రీ గురుదేవులు విశేష కార్యక్రమాలు చేయించుకుంటారేమో! వికృతిలోని విశేషార్థాన్ని మనం గుర్తించాలి. లక్ష్మి నామాలలో 'ప్రకృత్యైనమః', 'వికృత్యైనమః', 'సర్వభూత హితప్రదాయైనమః' అని ఉన్నాయి.

మనం విశ్వాసం పెంచుకోవాలి. ఈ జీవితం మనకు భగవంతుడు ఇచ్చిన మూలధనం. ఆ అసలుకు వడ్డీ మనం ఏమి పెంచుతున్నాం? (వృద్ధికి వికృతి వడ్డీ) అంటే మన ప్రార్థన ఇచ్చిన పరమార్థమే. మంచినే చేయుట, మంచినే చూచుట, మంచినే గ్రహించుట - కాని ఇందుకు ఈర్ష్య, అసూయలు అడ్డు వస్తున్నాయి. పూజ, ఆరాధన మనం నిర్మలమైన హృదయంతో చేయగలుగుతున్నామా?

మనం పవిత్రమగు అంతఃకరణమును ప్రసాదించమని ప్రార్థిస్తాము. ఎందుకు? అది లేకపోతే జన్మ రాహిత్యస్థితి కలుగదు. వ్యక్తిత్వ భావన పోవాలి. సమష్టి భావన రావాలి. శ్రీకృష్ణ భగవానుడు కర్మ, జ్ఞాన, ధ్యాన మార్గాలు చెప్పి విజ్ఞాన యోగంలో బుద్ధిలేనివారు నన్ను వ్యక్తిగా చూస్తారు -

**అవ్యక్తం వ్యక్తి మాపన్నం మన్యంతే మామబుద్ధయః ।**
**పరంభావ మజానంతో మమావ్యమ మనుత్తమం ॥**

అంటాడు.

మహాత్ములు మన గుమ్మంలోకి వచ్చి 'నీ హృదయం పవిత్రం చేస్తాను' అంటే మనం వారిని కోరే కోరికల లిస్ట్‌కు అంతు ఉండదు. 'భగవంతునికోసం ఎంత సమయం వినియోగిస్తున్నామో అదే మన నిత్య కాలంలో జమ అవుతుంది' అన్నారు శ్రీ గురుదేవులు. పరమాత్మ వస్తువు నీలోనే దాగి ఉంది. మొదట నిన్ను నీవు గుర్తిస్తే అందరిలోను ఉన్న పరమాత్మ నీవే అని గుర్తిస్తావు.

మనం బృందావనంలో ఉంటే వికృతి అంటే భయపడనవసరం లేదు కాని, ఇక్కడ ఉండి కూడా కాని విషయాలను ఆలోచిస్తే అది వికృతి అవుతుంది. భగవత్తత్త్వం ఎంత మననం చేస్తే మన జీవితం అంత సాఫీగా సాగుతుంది. మనం క్రిందటి సంవత్సరం కంటే ఈ సంవత్సరం మంచి భావనను పెంచుకొందాం. అందరికీ మంచిని పంచిపెడదాం. అటువంటి సద్భావన, సుఖ శాంతులు శ్రీ సద్గురుదేవులు ప్రసాదించుగాక! సుఖీభవ! సుఖీభవ!

# భద్రవాక్యం

**యద్యపి గగనం శూన్యం తథా ऽ పి జలదాంశురూపేణ ।**
**చాతక చకోరనామ్నో ర్దృఢభావా త్పూరయత్యాశామ్ ॥**
**తద్వదృజతాం పుంసాం దృగ్వాఙ్మనసామగోచరో ऽ పి**
**కృపయా ఫలత్య కస్మా త్సత్యానన్దామృతీన విపులేన ॥**

ఆకాశానికి రూపం లేదు. అది కన్నులకు కనిపించదు. మేఘాలుగాని, వెన్నెలగాని అందులో స్వభావసిద్ధంగా ఉండవు. అయినా చాతక పక్షులు ప్రాణాలు పోతున్నా సరే వేరే ఏ నీటిని త్రాగక, ఎండాకాలం అయినా సరే మేఘాలు వర్షించే జలధారలకోసం ఆ శూన్యమైన ఆకాశంలోకి అలా చూస్తూ నిరీక్షిస్తుంటాయి. అలాగే చంద్ర కిరణములు అనే అమృతాన్ని తప్ప మరి దేనిని స్వీకరించని చకోర పక్షులు, ఏ రూపమూ లేని ఆ ఆకాశాన్నే ఆశ్రయించి ఆ శూన్యంలోకే చూస్తూ వెన్నెలల కోసం నిరీక్షిస్తూ ఉంటాయి. శ్వాస పోవచ్చుగాని వాటి విశ్వాసం పోదు. అచంచలమైన ఆ దృఢ విశ్వాసం ఫలితంగా ఆకాశంలో ఎక్కడినుంచో ఆకర్షించబడి నీలమేఘాలు వచ్చి వర్షిస్తాయి. చాతక పక్షులు ఆ వర్ష జలాలను త్రాగి ఆనందాబ్ధిలో ఓలలాడతాయి. అలాగే స్వభావ సిద్ధంగా ఆకాశంలో లేని చంద్రుడు పక్షుల అచంచల విశ్వాసానికి ఎక్కడినుంచో ఆ శూన్యాకాశంలోకి ఆకర్షించబడి అక్కడ ప్రకాశించి తన అమృతమయమైన కిరణాలను కురిపిస్తాడు. చకోరాలు ఆ సుధామయ చంద్రికలను గ్రోలి తృప్తి పొందుతాయి.

అలాగే శ్రీ కృష్ణుడు తనను అనన్యమైన భక్తి ప్రపత్తులతో శరణు జొచ్చిన భక్తులకు కనపడకపోవచ్చు. ఇంద్రియగోచరం కాకపోవచ్చు. వాళ్ళకు తెలియక పోవచ్చు. అయినా సరే వారి దృఢ భక్తికి ఆకర్షింపబడి, వారికి ఇష్టమైన ఏదో ఒక రూపంలో వారికి తన దర్శన భాగ్యాన్ని కలిగించి వారికి బ్రహ్మానందాన్ని ప్రసాదించి వారిని కృతార్థులను చేస్తాడు. వారికి జనన మరణ ప్రవాహం నుంచి మోక్షన్ని ప్రసాదిస్తాడు.

శంకరభగవత్పాదాచార్యులవారు శ్రీకృష్ణానంద లహరిగా ఉన్నదని ప్రతీతి గాంచిన ప్రబోధ సుధాకరాన్ని ఉపసంహరిస్తూ, వైరాగ్యము, ఆత్మబోధ, భక్తి మూడు పరిపక్వమై మోక్షసాధనమౌతుందని ఈ పై శ్లోకాలలో, చెప్పకనే చెప్తున్నారు. *

# అమ్మ ఆశీస్సులు

భగవంతుడిని దర్శించటానికి కావలసినవి మూడు. అవి - విచారణ, పురుషార్థం, గురుకృప. విచారణ అంటే శ్రీగురుదేవులబోధపై విచారణ చేయటం. భగవత్ప్రాప్తికోసం మనం పడే ఆవేదన, చేసే ప్రయత్నమే పురుషార్థం. ఈ రెండూ ఉన్నా గురుకృప లేనిదే భగవద్దర్శనం దుర్లభం.

మేము విచారణ చేస్తున్నాముకాని అందులోని అమృతాన్ని మేము పొందలేకపోతున్నాము అని అంటారు కొందరు. మనం అమృతస్వరూపులం అయ్యే ఉన్నాం. అయితే భగవంతుడు మనకు ఎప్పుడు, ఎలా ఏ రూపంలో దర్శనం ఇస్తాడో అది ఆయన ఇష్టం. మనం చేసే సాధన మనం చేస్తూ ఆయన కృపకోసం నిరీక్షించాలి. ఆ నిరీక్షణలో ఎంతో ఆనందం ఉంది. ఇది నా స్వానుభవంతో చెబుతున్నాను. భగవద్దర్శనం అయింది అనుకోండి. ఆ తరువాత ఇంకేమిటి?

శ్రీ వ్యాసమహర్షులవారు తన కుమారుడైన శుకునికి బ్రహ్మజ్ఞానం బోధించారు. అయినా శుకునికి ఏదో అసంతృప్తి! ఇంకా తెలిసికోవలసింది ఏదో ఉంది అనే తీవ్ర జిజ్ఞాస! శ్రీ వ్యాసులవారు అతనిని బ్రహ్మజ్ఞాని అయిన జనకమహారాజు వద్దకు పంపారు. వారంరోజులైనా ఆయనకు జనకమహారాజు దర్శనం కాలేదు. శుకుడు నిర్వికారభావంతో వేచి ఉన్నాడు. ఆ తరువాత రాజసౌధ ప్రవేశం అయింది. కాని రాజ దర్శనం కాలేదు. స్వర్గభోగాలు అన్నీ అక్కడ అమర్చబడ్డాయి. అందమైన యువతులు, షడ్రసోపేతమైన భోజన పానీయాలు సమకూర్చబడ్డాయి. కాని శుకుడు ఏ ఆకర్షణలకూ లొంగలేదు. ఆయన దృష్టి బ్రహ్మమునందే నిలిచి ఉంది. జనకమహారాజు స్వయంగా వచ్చి శుకునికి సకల మర్యాదలు చేసి వచ్చిన కారణం అడిగాడు. శుకుడు తాను ఇక తెలిసికోవాల్సింది ఏదీ లేదని తిరిగి వచ్చేశాడు.

మనకు అడ్డుగా వచ్చేది అవిద్య. దానినే అజ్ఞానం అని కూడా అంటారు. దానిని తొలగించుకోవాలి. మన ఇష్టదైవాన్ని మొదట మన హృదయంలో దర్శించాలి. ఆ తరువాత అన్నిటిలో ఇష్టదైవాన్ని దర్శించాలి.

శ్రీ గురుదేవుల అష్టోత్తర శత నామావళిలో "ఓం రామనామామృత రసాస్వాదనైక కుతూహలాయ నమః" అనే నామం ఉంది. రామ నామామృతాన్ని రసాస్వాదన చేయుటలో ఎంతో ప్రీతి కలిగినవారు అని అర్థం. ఆ విధంగా మనం మన ఇష్టదైవాన్ని జపిస్తే మన ఇష్టదైవాన్ని మనం తప్పక దర్శించగలుగుతాం.

మనము వికృతినామ సంవత్సరంలో ప్రవేశించాము. గురుకృప సంపాదించినవానికి ఏ లోటు ఉండదు. ఏ భయమూ ఉండదు.

ఈ సంచిక మీ చేతిలోకి వచ్చేసరికి మనం శ్రీరామనవమి పర్వదినాన్ని ఎంతో హర్షోల్లాసాలతో చేసికొని శ్రీ రామకృపను పుష్కలంగా అనుభవిస్తూ ఉంటాము. శ్రీ సద్గురుదేవుల కృప అందరిపై వర్షించుగాక! సుఖీభవ! సుఖీభవ!!

- మీ అమ్మ

# సంపాదకీయం

శ్రీవిరోధినామ సంవత్సరానికి వీడ్కోలు చెప్పి, శ్రీ వికృతినామ సంవత్సరంలో అడుగు పెట్టాము. అయితే శ్రీసద్గురు దేవుల ఆశీస్సులతో, కొందరు భక్తులకు శ్రీవికృతినామ సంవత్సరంలో మౌనధ్యాన సప్తాహంతో అడుగుపెట్టే అదృష్టం కలిగింది. పూజ్య యోగిని శ్రీ చంద్రకాళీ ప్రసాద మాతాజీ ఈ సందర్భముగా తమ అనుగ్రహ భాషణంలో వృద్ధి అనే ప్రకృతికి వడ్డీ అనేది ఎలా వికృతి అవుతుందో శాస్త్రము అనే పదం ప్రకృతి అయితే చట్టము అనేది దానికి వికృతి అవుతుందో, అలాగే ప్రకృతి అనే పదానికి వికృతే వికృతి అనీ, ఆ దృష్టితో చూచినప్పుడు ప్రకృతిగత స్వభావులైన జీవులందరికీ వికృతి కేవలం పరబ్రహ్మమే అని వివరించారు. రక్తాక్షి, రుధిరోద్గారి వంటి పేర్లతో పోలిస్తే ఈ వికృతి చాలా సౌమ్యమైనది అని, ఏ సంవత్సరం అయినా గురుదేవుల అభయహస్త నీడలో, గురు సంప్రదాయంలో ఉన్నవారిని ఏ గ్రహాలు ఏమీ చేయలేవని, సద్గురు దేవుల కృప మనందరిపైన వర్షించి, అందరిని తప్పక కాపాడుతుందని పేర్కొన్నారు. మౌనధ్యాన సప్తాహ శిబిరంలో రెండవరోజు సాయంత్రం, శ్రీ గురుధ్యాన దీపిక నుండి శ్రీ నారాయణ ప్రసాద్, బాబూజీ ధ్యానాన్ని గురించి చెప్పిన అంశాలను చదివిన తరువాత శ్రీమాతాజీ కొద్దిసేపు వివరించారు. అనంతరం పరమహంస పరివ్రాజక పూజ్యపాద శ్రీశ్రీశ్రీ 108 దండి నిర్మలానందగిరి స్వామి వారు ధ్యేయాన్ని గురించి తైలధారవలె చింతన చేయటమే ధ్యానం అని, ఆ ధ్యేయ వస్తువు దేశకాల పరిచ్ఛిన్నమైనది అయితే, ధ్యాత కూడ పరిచ్ఛిన్నుడై, దుఃఖము పాలౌతాడు అని, అందువలన ధ్యేయ వస్తువు కేవలం పరబ్రహ్మమొక్కటే అని, శ్రీరాముణ్ణి, శ్రీకృష్ణుణ్ణి ధ్యానించే వారు కూడ, మొదట సాకారంగా, సగుణంగా ధ్యానించినా ఆ రూపనామములు కూడ దేశకాల పరిచ్ఛిన్నములే కనుక ఏనాటికైనా ఆ శ్రీరాముడిలోని, శ్రీకృష్ణుడిలోని, నిరాకారము, నిర్గుణము అయిన పరబ్రహ్మ తత్త్వాన్ని ధ్యానించినప్పుడే వారి మనస్సు బ్రహ్మాకార వృత్తి ధరించి, అద్వైత వృత్తిని కూడ దాటి, వారు అద్వైత దీప్తిని పొందుతారు అని నిర్మలమైన, ఆనందమయమైన బోధను దండిగా అందించారు.

ఈ నెల 24వ తేదీన శ్రీరామనవమి ఆశ్రమంలో చక్కగా జరుపుకున్నారు. సీతారాముల సాముహిక కళ్యాణాలు ఎంతో భక్తి భరితంగా జరిగాయి.

- గౌరవ సంపాదకుడు

# బాబూజీ ఉవాచ

(గత సంచిక తరువాయి) - స్వామి విజయేశ్వరానంద ప్రసాద్

కాని అలాగే పరుగెత్తుతున్న ఆ మనస్సు చంచలత్వాన్ని సహించలేక ఒక దెబ్బ వేశారు. ఆమె ఆశ్చర్యపడి కనులు తెరిచింది. ప్రక్కనే ఉన్న రాణి రాసమణి మేనల్లుడు, ఎస్టేటు కార్యనిర్వాహకుడు అయిన మధురబాబు దానిని సహించలేక శ్రీరామకృష్ణుని మందలించబోవగా రాణి రాసమణి అతనిని వారించి పరమహంస పాదాలపై బడి క్షమించమని ప్రార్థించింది. "మరి నన్నేం చెయ్యమంటావు తల్లీ! నేనెంత సంకల్పించినా వినక నీ మనస్సు కోర్టు దావాల మీదా, కొడుకు మీదా పరుగెత్తుతుంటే దాని ఆగడాన్ని సహించలేక అమ్మ



దాని చంచలత్వంపై దెబ్బ వేసింది. ఈ దెబ్బ పడింది అలా నిన్ను ముప్పుతిప్పలు పెడుతున్న నీ మనస్సుపైనే గాని నీపైన కాదమ్మా, జగజ్జనని అయిన అమ్మ పవిత్ర సన్నిధిలో కూర్చున్న కాసేపైనా మనస్సును యితరత్రా పోనీయకుండా ఆమెపై నిలిపి ధ్యానించకపోతే ఎలా? ఇకనయినా అలా మనస్సు అమ్మపై నిలిపి ధ్యానించు" అన్నారు పరమహంస. ఆమె పశ్చాత్తాపపడి, ఈసారి ఎంతో పట్టుదలతో అలాగే అమ్మపై మనసు నిలిపి ధ్యానం చేసింది. అలా మూడు రోజులు కదలకుండా ధ్యానం చేసేసరికి ఆమెకు ధ్యానమూ కుదిరింది; కోర్టులో వ్యాజ్యమూ గెలిచింది. లండన్‌లో ఉన్న కొడుకు పరీక్ష ప్యాసైనట్లు వార్త కూడా వచ్చింది. ఆమె సంస్కారమూ పవిత్రంగా మారింది.

కరుణామయుడైన అటువంటి గురువు ఋణాన్ని ఎలా తీర్చగలము? ధనధాన్యాలతో గాని మరి దేనితో గాని తీర్చుకోలేము. వారు ప్రసాదించిన లక్ష్యార్థాన్ని సాధించి, వారికి ఆనందాన్ని కలిగించటం ద్వారా మాత్రమే వారి ఋణాన్ని తీర్చుకోగలము. అలా చేసిన వారు ప్రహ్లాదుడు, ధ్రువుడు. అట్టి భక్తులకు భగవానుడు కరతలామలకము. తన భక్తులకు ఎప్పుడేది ఇవ్వాలో ఆ ప్రభువుకు తెలియదా?

జపమాల తిరుగుతున్నా, ఆసనం మీద కదలకుండా కూర్చున్నా, కాషాయ వస్త్రాలు ధరించినా, మనస్సు విషయాదులపై తిరుగుతుంటే లాభం లేదు. మనస్సు సన్యసించాలి. అదే నిజమైన సన్న్యాసము. జనకుడు, బుద్ధుడు

అటువంటి సన్న్యాసం చేశారు. తుకారాం, గోరా కుంభారు అటువంటివారే. వారే నిజమైన సన్న్యాసులు. గోరాకుంభారు భార్యలిద్దరూ (కామశక్తులు) అతనికి రెండు వైపులా పడుకున్నారు. వారి మధ్యలోనే గోరాకుంభారు ఉన్నా, ఆయన మనస్సు మాత్రం పాండురంగని మీదనే లగ్నమై నిలిచిపోయింది. జాగ్రత్, స్వప్న, సుషుప్తి అనే మూడు అవస్థలలోను అదే స్మరణ. భార్యలిద్దరి మధ్యనే ఉన్నా, ఆయన శ్రీపాండురంగని ఒడిలోనే పడుకున్నాడు. ఇక ఆ పరమాత్మని ప్రేమ ఆ బిడ్డపై ఎంతైనా వర్షించటంలో ఆశ్చర్యమేమున్నది? "ప్రభూ! ప్రేమమయా!" అని ఆనంద బాష్పాలు రాల్చాడు గోరాకుంభార్. భక్తి కామంలో మునిగిన అతనిని కామపిశాచి ఏమి చేయగలదు?

హృషీకేశ్‌లో సన్న్యాసులకు ధ్యానం చేసుకోవటానికి ఆశ్రమాలు ఏర్పాటు చేశారు. వారికి రోజూ ఉచితంగా రొట్టె, పాలు సరఫరా చేస్తారు. ఆ రొట్టె, పాలతో కుక్షి నింపుకొని బ్రతుకు తెరువు గడుపుకోవటానికి కొందరు సన్న్యాసుల వేషంలో అక్కడకు చేరుతూ ఉంటారు. వారు ధ్యానానికి కూర్చున్నా, వారి దృష్టి రొట్టె, పాలు ఎప్పుడు వస్తాయా అనే ఉంటుంది గాని ధ్యానం ఎక్కడ కుదురుతుంది? అటువంటిరొట్టె సన్న్యాసి కారాదు. కబీరు వంటి గట్టి సన్న్యాసి కావాలి. కబీరు ఒక చేతిలో రొట్టెను, ఒక చేతిలో నెయ్యి ఉంచుకుని రామ ప్రభువును ధ్యానం చేసుకుంటున్నాడు. ఇంతలో కుక్క రూపంలో భగవానుడు వచ్చి ఆ రొట్టెను నోట గరచుకొని పోతుంటే కబీరు కళ్ళు తెరచి చూశాడు. అతనికి రామ ప్రభువే రొట్టె తీసికొని వెడుతున్నట్లు కనిపించింది. కబీరు నేతి గిన్నెతో వెంట పరిగెత్తుతూ "ప్రభూ! ఆ రొట్టెతో పాటు ఈ నెయ్యి కూడా నీ కోసమే నివేదన చేశాను. వట్టి రొట్టె అయితే గొంతు దిగదు. ఈ నెయ్యి కూడా తీసుకో ప్రభూ!" అంటూ పరిగెత్తాడు. కంచెలలో, ముళ్ళలో, రాళ్ళలో పడి ఒళ్ళు గీరుకుపోతున్నా అతనికి తెలియలేదు. దయాళువైన ప్రభువు నిజరూపంతో తిరిగి వచ్చి, ఎంతో ప్రేమతో కబీరు శరీరాన్ని తన దివ్య హస్తంతో నిమిరాడు. ఆ పవిత్ర స్పర్శతో కబీరు పార్థివ శరీరము జ్ఞాన వజ్ర శరీరంగా మారింది. రామప్రభువు ఆ రొట్టెను నేతిలో ముంచి, తాను తింటూ "కబీరూ! ధన్యుడవోయి! దేవతలకు కూడా ఈ దివ్య ప్రసాదం అలభ్యమైంది సుమా!" అంటూ ఆ బిడ్డ నోటిలో ఆ మహా ప్రసాదం పెట్టి స్వయంగా తినిపించాడు. కబీరు నిజమైన సన్యాసియో, ధ్యానం చేస్తూ కూడా రొట్టె కోసం ఎదురు చూసే కాషాయ వస్త్రధారి నిజమైన సన్న్యాసియో ఇప్పుడు చెప్పండి? ఎవరి జన్మ ధన్యము?

అలా ప్రహ్లాదుని వలె, ధ్రువుని వలె, కబీరు వలె, భగవంతుని ఆరాధించి, సేవించి, తరించి, పునర్జన్మ రహిత స్థితిని పొందండని నా హెచ్చరిక. అది సద్గురు కృప వల్ల మాత్రమే కలుగుతుంది. పరమాత్మ యందు నిరంతరము మీ మనస్సును నిలిపితే, వాడు మీ మనస్సున నిలుస్తాడు. గృహస్థుడై ఉండి కూడా మానవుడు సన్న్యాసి కావటం అంటే ఇదే. ఇదే నిజమైన సన్న్యాసము. గృహస్థుడు భగవద్ధ్యాన హోమంలో నిరంతరము తనలోని నీచగుణాలను, కలుష భావాలను హోమం చేయాలి. భగవంతుని ప్రేమను జుర్రుకోవాలి. ఆత్మ సుఖానికి నిజమైన వారసుడు కావాలి. ఆత్మ సుఖమే సుఖము, ఆత్మ రతియే రతి. అట్టి జన్మమే ధన్యము. ఎన్ని ధన ధాన్యాలున్నా, భోగభాగ్యాలున్నా పొందలేని మనశ్శాంతిని, శాశ్వతానందాన్ని ప్రసాదించేది పరమాత్మ వస్తువు. దానిని నమ్ముకుని సాధించుకోగలిగితే, ఇహంలోను పరంలోను కూడా శాశ్వత శాంతి సుఖాలు మీ సొమ్మే అవుతాయి.

అఖండ సుఖ శాంతులను ప్రసాదించి సర్వదా గురు పాదుకలు మిమ్ము కాపాడు గాక !

8-10-1978

**అశ్వయుజ శుద్ధ షష్ఠి**

శ్రీదేవీ శరన్నవరాత్రి పూజలు ప్రారంభమై అప్పుడే ఇవాళ ఆరవరోజు. కాలం మనతో నిమిత్తం లేకుండా గడిచిపోతోంది. మనలో ఉన్న ఆరు గుణాలను, అంటే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలను జయిస్తే గాని శాంతి దొరకదు. అవి మనకు, పరమాత్మ వస్తువుకు మధ్య ఆవరణగా ఉన్నవి. ఆ అడ్డును తొలిగించుకుంటే గాని అవతల ఉన్న పరమాత్మ వస్తువును తెలుసుకోలేము. మానవుని అంతరింద్రియములైన మనో, బుద్ధి, చిత్త, అహంకారములనే నాలుగింటిలోను చివరి దాని నుండి, అంటే అహంకారము నుండి ఈ ఆరుగుణాలూ ఉత్పన్నమైనవి. అవి మహా బలీయములైన శత్రువులు. ఈ శత్రువులను జయించటానికి మామూలు ఆయుధాలేవీ పనికిరావు. అధ్యాత్మ శక్తి, ఆత్మబలం కావాలి. ఆ శక్తి, బలము ఎక్కడ నుండి వస్తాయి? ఎలా వస్తాయి? బెడ్‌కాఫీ, టీ, చద్దన్నము, breakfast ,లేదా మీగడ పెరుగు తింటే రావు. అవన్నీ సోమరితనాన్ని, నిద్రను పెంచుతాయి మాత్రమే. సోమరితనమే అజ్ఞానము, దరిద్రము. ఇక ఎప్పుడూ నిద్రపోయేవాడు చచ్చిన వానితో సమానము.

-సశేషం

# మాతాజీ అభిభాషణ

(గతసంచిక తరువాయి) -జపమాల ప్రసాద

ప్రపంచం వైపు రాగం పెంపొందించుకుంటే అది మనకి రోగాన్ని తెచ్చిపెడుతుంది. అదే భగవంతుని వైపు అనురాగాన్ని పెంచుకుంటే అది మనకి యోగాన్ని ప్రసాదిస్తుంది. ఎవరి అనుభూతి వారి స్వంతం. మనస్సే తద్వస్తు రూపం అయిపోయినప్పుడు, యిక దేనిగురించి చెప్పుకోవాలి? మనసు తదాకారం పొందాక, ఈ దేహంలోనుండి హంస లేచిపోయినా, యిక పునర్జన్మ అనేదిలేదు.



ఎవరు ఏ విధంగా కొలిచినా, శక్తి ఒక్కటే. అన్ని రూపాలలోను, అన్ని నామాలలోనూ వున్నది ఆ ఒక్క శక్తే. నామం అనేది కేవలం ఆ అనంతశక్తిని చేరుకునేందుకు ఒక నిచ్చెన లాంటిది. ఆ అనంత శక్తిని గుర్తించిన మహాత్ములని గుర్తించడం చాలా కష్టం. షిర్డీ సాయిబాబా సశరీరులై వుండగా ఎంతమంది ఆయనని మహాత్ముడిగా గుర్తించారు?

తుల్య నిందాస్తుతిర్మౌనీ, అని దూషణ భూషణలన్నింటికీ ఒడి పట్టారాయన.

మనలోని ఈర్ష్యాసూయలు రహితమవ్వాలంటే, భగవంతుడిలో లేని గుణాలు మనలో వుండకుండా చేసుకోవాలి. భగవంతునిలో వున్న గుణాలని మనం అలవరచుకోవాలి. ఇది మనం ముఖ్యంగా అండర్‌లైను చేసుకుని ఆచరించాలి. నీలో వున్న శక్తి అనంతంగా ప్రకాశిస్తోందని తెలుసుకుంటావు. ఉపాధులు మారినా, కరెంటు ఒకటే. మనం ఉపాసించే దేవుడే సర్వేశ్వరుడు, సర్వశక్తిమంతుడు. ఉప=సమీపే - వాస:=నివసించడం; అంటే భగవంతుని వద్దే మనసునుంచడం నిజమైన ఉపవాసం. అమ్మ మనదగ్గరే వుంది అనుకుంటేనే ఆనందాన్ని పొందగలం. ఎక్కడో వుందనుకుంటే ఏడుపే. మృత్యువు మనని కబళించకముందే మనలోనే వున్న అమ్మని గుర్తించాలి. ఆనాడు మొసలి వాత పడిన గజేంద్రుడు తనని రక్షించమని తన దారాపుత్రాదులని కోరాడు. వాళ్ళు మననుండి ఏ ఆనందం పొందుదామా అనే చూస్తారు గానీ, మన అక్కరనేమీ తీర్చరు కదా! ఎదుటివాడి సుఖం చూసేది ఒక్క మహాత్ములు మాత్రమే. తనవారనుకున్న వారంతా, తనని వదలి

వెళ్ళిపోతే, "లావొక్కింతయు లేదు. ధైర్యము విలోలంబయ్యె..." అని, నీవు తప్ప నాకింక ఎవ్వరూ లేరని ఆ శ్రీహరికి మొరబెట్టుకున్నాడు గజేంద్రుడు. ఆ శ్రీహరి ఎక్కడో వైకుంఠపురంలో శ్రీదేవితో పాచికలాడుతూ వుండగా, గజేంద్రుని పిలుపు అందేసరికల్లా, అమ్మవారితో కూడా చెప్పకుండా, శంఖుచక్రాలు ధరించకనే, చేతిలో వున్న శ్రీసతి చీరకొంగుని పట్టుకున్నవాడు అలాగే ఆ చీర కొంగుతోనే, తన భక్తుడిని రక్షించడానికి పరుగులు పెట్టాడు. "అవసరం వస్తే ఆయనే సెల్‌ఫోనులో పిలుస్తాడులే" అని వూరుకోకుండా, శంఖుచక్రాలు, గరుత్మంతుడూ, జగన్మాతా - అందరూ ఆయన వెనకాలే పరుగులు పెట్టారు!

భగవంతుడి కోసం నిరీక్షించాలి. సాధనంతా ఆ నిరీక్షణలోనే వున్నది. మనం కాలమనే ట్రెయిన్ (రైలుబండి)లో వున్నాం. అది సాగుతూనే వుంటుంది. కాలుడు కబళించే లోగానే, మీరు నమ్మిన ప్రభువుని గుర్తించండి. సోమరితనమే అజ్ఞానం. మనకి ఏ టైములో ఏమివ్వాలో ఆ ప్రభువుకి తెలుసు. వ్యష్టి భావాన్ని వీడి సమష్టి భావాన్ని అలవరచుకోవాలి. మహాత్ములు సంచరించిన ప్రదేశాలు సమష్టి భావంతో నిండివుంటాయి. ఒక గురుదేవుణ్ణి ఆశ్రయించి వారు చెప్పింది చెప్పినట్టుగా చేస్తే అది పెర్‌ఫెక్ట్. అంతేగాని, మధ్యలో మీ మనసు ప్రవేశిస్తే మహాత్ములందించేది అందదు. కడుపుకి ఆహారం మనం తినే భోజనం; మనసుకి ఆహారం గురుబోధ. అది పుష్కలంగా దొరకడానికి మనకి సాధుధర్మసమ్మేళనం ఏర్పాటు చేశారు గురుదేవులు. క్రియకి కుంకుమ పూజ వుండనే వున్నది కనుక సత్కర్మాచరణకి అది ముఖ్యం. ఇక మానవకళ్యాణానికి ఉపకరించే వైదిక కర్మ మనం చేస్తున్న చండీ హోమం. అందరూ కుంకుమ పూజలు, హోమాలు చేసుకోలేంకదా అని బాధ పడతారేమోనని, 'కలౌ కేశవ కీర్తనాత్' అని, ఈ కలికాలంలో మనకి నామస్మరణకి మించిన యజ్ఞం లేదని, అఖండ హరినామ సంకీర్తన ప్రసాదించారు సద్గురుదేవులు. ఈ విధంగా మన త్రికరణములు - మనస్సు, వాక్కు, శరీరము కూడా శుద్ధి చెందుతున్నాయి.

మీరాశ్రయించిన గురువే దైవం. "మాకు గురువు లేరండీ" అంటారా, మీరు నమ్మిన దైవమే మీకు గురువు. కనుక, ద్వైత భావనను వీడి, యిందరిలో వున్న ఏకైక శక్తిని గుర్తించండి. మనకు ఎంతవరకూ సాధ్యమో అంతవరకూ, ఆయా సేవలలో పాలుపంచుకుని, ఆ జగన్మాతని సేవించుకుందాం. అమ్మకృపకి పాత్రులమవుదాం. *

## 6. ఏది నిజమైన జీవితం?

(శ్రీదేవీ సహస్రచండీ యాగంలోని అంగంగా జరిగిన సాధుధర్మ సమ్మేళనంలో, 19-02-2003న ఉదయం జరిగిన ప్రథమ సమ్మేళనంలో శ్రీమాతాజీ వారి దివ్య అభిభాషణ.)

"పూజ్య స్వామిజీల, పూజ్యమాతాజీవార్ల దివ్య చరణార వింద ములకు ప్రణమిల్లుతూ, మీ అందరిలోనూ ప్రకాశిస్తున్న ఆ పరమాత్మ వస్తువుకు నమస్కరిస్తూ...

ఎంతోమంది మహాత్ములందిస్తున్న మహావాక్యాలని మీరందరూ ఎంతో జాగ్రత్తగా శ్రవణం చేసి హృదయంలో దాచుకుంటున్నారు. తరిగిపోయేటటువంటి ఈ జీవితంలో తరగనటువంటి పరమాత్మ వస్తువుని తెలుసుకుంటే తరుగులేనటువంటి స్థితిని చేరుకోవచ్చు. తరిగిపోయేటటువంటి ఇహాన్ని పట్టుకోలేంగాని, తరగనటువంటి ఆ మాధుర్యాన్ని, సూర్యచంద్రాదు లున్నంత వరకు కూడా అనుభవించవచ్చు. అదే పరమాత్మ వస్తువు. అటువంటి త్రోవని మనకి చూపించినవారే మహర్షి మళయాల స్వాములవారంటే, సద్గురుదేవులు శ్రీబాబూజీ మహరాజ్, శ్రీరామకృష్ణ పరమహంస, వివేకానంద, రామతీర్థ, రమణమహర్షి యిత్యాదులు. భగవద్గీతలో ఎన్ని అక్షరాలయితే వున్నవో, అంతమంది మహాత్ములతో విలసిల్లుతోంది మన భారతదేశం. అందుకే మనదేశం రత్నగర్భ. ఏ ఒక్క మహత్ముడు ప్రసాదించిన దివ్యబోధని సంపూర్ణంగా జుర్రుకుని, హృదయంలో పదిలపరచుకొని ఆచరించినా, ఈ జన్మ వచ్చినందుకు ధన్యత చేకూరుతుంది. దానిని మనం గుర్తించగలగాలి. అణువు అణువులోనూ వున్న సత్యాన్ని వెతుక్కుంటూ వెళ్ళి, దానిని గుర్తించినప్పుడే, ఆ మహానుభావులు చెప్పిన మాధుర్యాన్ని మనం పూర్తిగా అనుభవించిన వాళ్లమవుతాం. అంతేగాని, మహాత్ములని చూసి, "వాళ్లెక్కడి నుంచి వచ్చారు? ఏజాతి? బ్రాహ్మలా? క్షత్రియులా? ఎక్కడుంటున్నారు? ఏం తింటారు?" అనే ప్రశ్నలు ఎందుకు? వారు అందించేటటువంటి మహావాక్యాలని, బోధామృతాన్ని చక్కగా గ్రోలి, హృదయంలో నింపుకుని, వారు పదిముక్కలు మాట్లాడితే, మనం అందులోనిది ఒక్కటైనా ఆచరించడానికి ప్రయత్నం చేస్తే, ఆనందం పొందగలంగాని, అనవసర ప్రసంగాలతోటి కాలం వ్యర్థం చేస్తే తరింపు ఎక్కడ? కాలం మించిపోతున్నదని గుర్తించండి.

-సశేషం

# సన్నిధిలో సంభాషణ

(గతసంచిక తరువాయి)

- పరాశర ప్రసాద్

21-3-1985

ఈ రోజు ఉదయం శ్రీబాబుతో వాకింగ్‌లో పాల్గొన్నప్పుడు ప్రసాదరావుగారు మాట్లాడుతూ మీ చరిత్ర తెలుసుకోవాలని ఉంది బాబు అన్నారు. శ్రీబాబు మాట్లాడుతూ 'తెలిసికొని ఏం చేస్తావు? అది నీ సాధనకు ఉపకరిస్తుందా? అది నిన్ను తరింపజేస్తుందా? దుర్యోధనాదులు శ్రీకృష్ణ పరమాత్మను గురించి తెలిసికొని ఏం చేశారయ్యా? వాళ్ళు చేసే దుష్కృత్యాలు ఏమైనా చేయకుండా ఊరుకున్నారా? మహాత్ముల జన్మ రహస్యం తెలియటం కష్టం. వారి తల్లిదండ్రులెవరో తెలుసుకోవటం అంతకన్న కష్టం. వారికి విభూతులంటే ఇష్టం ఉండదు. షిరిడీసాయిబాబాను చూడండి. ఆయన తల్లిదండ్రులు ఎవరో చెప్పగలరా? విశ్వాసం పెంపొందించుకోండి చాలు. నాకు కీర్తి వ్యామోహం లేదు. ఆహా ఓహోలు అసలే లేవు. భగవంతుడి దృష్టిలో పడాలిగాని, ప్రజల దృష్టిలో పడటం ఎందుకు? ప్రజలకి ఏదైనా ఉపకారం చేయదలిస్తే వారికి తెలియకుండా చేయవచ్చు.

నా బాల్యంలో ప్రజల దృష్టిలో పడకుండా జాగ్రత్త పడేవాడిని. లేకపోతే నన్ను సాధన చేయనిస్తారా? నేను ఎన్నో కష్టాలను ఎదుర్కొని సాధన చేసి ఆర్జించిన దాన్ని అరటిపండు ఒలిచి నోటికి అందించినట్లు అందిస్తుంటే మీకు అందుకోవటానికి కష్టంగా ఉంది. నేను బాల్యంలో పొలం దున్నేవాడిని. పొలానికి గట్లు వేయటం, నీళ్ళు కట్టటం, త్రొక్కటం కూడా చేసేవాడిని. దానిని తోరాల అంటారు. ఏం సత్తిరాజుగారూ! అంతేనా? 'అని ప్రశ్నించారు. సత్తిరాజుగారు సమాధానం చెబుతూ అంతేబాబూ! అన్నారు. ముఠావాళ్ళతో ఉండేవాడిని. పని పూర్తిఅయిన వెంటనే మధ్యాహ్న సమయంలో కాలాన్ని వృథా చేయకుండా దూరంగా ఎవరి దృష్టిలో పడకుండా ఏ చెట్టు క్రిందనో కూర్చుని ధ్యానం చేసుకునేవాడిని. ముఠాలో మిగిలిన వారంతా వారు తెచ్చుకున్న పదార్థాలని భుజించేవారు. నాకు భోజనం విషయమే జ్ఞాపకం ఉండేది కాదు. ముఠావారిలో ఎవరైనా ఒకరు నన్ను చూసి ఏం బాబూ అన్నం తెచ్చుకోలేదా అని అడిగి అన్నం పెట్టేవారు. నా దుస్తులు ఎలా ఉండేవో తెలుసా? వాటికి కిటికీలు, దర్వాజాలు ఉండేవి. కాళ్ళకు చెప్పులు ఉండేవి కాదు. కాళ్ళకి రక్షణ కోసం కొబ్బరిపీచు కట్టుకునేవాడిని. నా బాల్య జీవితాన్ని మీకు చెబితే మీరంతా కళ్ళనీళ్ళు పెట్టుకుంటారు.

నేను చాలా సన్నగా ఉండేవాడిని. మీసాలు కూడా రాలేదు. కాళ్ళకు గండపెండేరం ఉండేది. ముంజేతికి పట్టీలు, మెడలో గంట ఉండేవి. కాకరపర్రు, ముక్కామల అగ్రహారంలో బ్రాహ్మణులు నాతో పోటీకి వచ్చేవారు. ఏ శాస్త్రంలో అయినాసరే వారు ఓడిపోయేవారు. వారు నాతో పోటీకి రాగానే మీరు గీతాచార్యుడిని ఎప్పుడైనా దర్శించారా? గీతలో గీతాచార్యుడు చెప్పింది అర్థం చేసుకున్నారా? అని ప్రశ్నించేవాడిని. వారు తెల్లముఖాలు వేసేవారు. జియ్యంగార్లతో తిరుగుతూ వాళ్ళ సాధన ఏమిటో తెలిసికొనేవాడిని. ఇంకా చాలా విశేషాలు ఉన్నాయి. అవన్నీ చెప్పాలంటే చాలా టైమ్ పడుతుంది.

నేను ఒక గ్రామంలో ఉండగా వెంకన్న అనే యాదవుడు రెండు పూటలా క్రమం తప్పకుండా నాకు పాలు తెచ్చి ఇచ్చేవాడు. నేను విశ్రమించటానికి చెట్టు క్రింద ఒక మంచం ఏర్పాటు చేశాడు. కొన్ని రోజుల తరువాతొక గుడిసె ఏర్పాటు చేశాడు. ఇది ఇలా ఉండగా ఆ ఊరి జనమంతా నా దర్శనార్థం వచ్చి ప్రశ్నలు వేసేవారు. వారి భూత భవిష్యత్ వర్తమాన విషయాలతో నన్ను విసిగించేవారు. ఇది నా సాధనకి అంతరాయం కలిగిస్తోందని తెలిసి ఆ గ్రామాన్ని వదిలి వెళ్ళిపోయాను.

పాపికొండల్లో చాలా కాలం తపస్సు చేశాను. ఎంతకాలమైనా ఇంతే కదా! ఎందుకీ నిరర్థకమైన జీవితం అని ధ్యానముద్రలో ఉండి కొండపైనుంచి క్రిందికి పడిపోయాను. కాని నేను మాత్రం ఒక చెట్టు కొమ్మకి తగులుకొని అలానే ఉండిపోయాను. అక్కడ ఉన్న కోయవాళ్ళు నన్ను చూసి క్రిందికి దింపి నా గాయాలకి చికిత్స చేశారు.

మీకు ఒక్క విషయం చెప్తాను వినండి. మీకు ఎంత మహాత్ముల చరిత్ర చెప్పినా మీలో ఎవరైనా సరే మాయకు లోను కాకుండా ఉండగలమని చెప్పండి, చూద్దాం? ఒక్క క్షణంలో మీరు మాయకు లోనయ్యేలా చేస్తాను. అది మీ తప్పు కాదు. అది మానవ సహజ లక్షణం. కాని గురుచరణార విందాలని నమ్మినవారికి మాత్రం లోటు ఉండదు. అంత ఎందుకు. మీరు ఇలా ఆశ్రమంలో ఉండి ఆశ్రమ జీవితం గడపగల్గాలంటే ఎన్నో జన్మల సంస్కారం రాశీభూతమైతే గాని లభించదు. అది అందరికీ సాధ్యపడదు. నా సాధన కోసం ఎంతో కష్టపడ్డాను. హనుమ నా వెంట ఉండి కాపాడుతూ ఉండేవాడు. నేను ముందుగా రామదర్శనాన్ని పొందాను. తరువాత రాముడన్నా నారాయణ స్వరూపిణి అయిన శక్తి అన్నా ఒక్కటే అని అనుభవ పూర్వకంగా తెలిసికొన్నాను. మా అమ్మ అనుజ్ఞ ప్రకారమే నాకు వాక్కు వచ్చింది. నేను ఇలా మీ మధ్యకి వచ్చి మాట్లాడగలుగుతున్నాను' అన్నారు శ్రీబాబు.

-సశేషం

## శ్రీకాళీగార్డెన్స్‌లో విశేషపూజా కార్యక్రమములు

### ఏప్రియల్ 2010

| | | |
|---|---|---|
| 8 | గురు | శ్రీ గురుదశమి, సత్సంగం,శ్రీ సద్గురు పాదపూజ. |
| 12 | సోమ | మాసశివరాత్రి |
| 28 | బుధ | పూర్ణిమ, సత్సంగ సమావేశం, శ్రీ సద్గురుపాదపూజ. |

### మే 2010

| | | |
|---|---|---|
| 8 | శని | శ్రీగురుదశమి, సత్సంగం,శ్రీ సద్గురు పాదపూజ. |
| 12 | బుధ | మాస శివరాత్రి. |
| 18 | మంగ | ఆది శంకరాచార్య జయంతి, శ్రీ సద్గురు పంచదశ వార్షిక ప్రతిష్ఠా మహోత్సవము,శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన |
| 27 | గురు | వైశాఖ గురు(బుద్ధ) పూర్ణిమ, శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన. |

## వైరాగ్యము

స్వా॥ నిత్యానంద - నేను సన్యాస దీక్షకై శ్రీకపిలానందస్వామి వారి మఠమున ఉన్నప్పుడు ఇక్కడ చిక్కుపడిపోతినే, ఎట్లు బయటకు పోదును అను చింత వేధించుచుండెను. ఆ స్వామివారికి ఇద్దరు శిష్యులు ఉండిరి. నేను ఆ మఠమునకు ఉత్తరాధికారిని అయిపోవుదునేమో యని వారి భయము. వారు లోలోపల నన్ను శంకించుచుండిరి.

స్వా॥ ప్రకాశానంద - "ఒక నైష్ఠిక బ్రాహ్మణుడు నదిలో స్నానము, సంధ్య చేసికొని ఇంటికి వచ్చుచుండెను. అప్పుడు త్రోవలో ఒక కుక్క ఎముకను నోట కరచుకొని తన ప్రక్కనే వచ్చుచుండెను. అది చూచి ఆ బ్రాహ్మణుడు 'ఇది ఆ ఎముకను నాకు ముట్టించును' అను సంకోచముతో కొంచెము వెనుకకు తగ్గసాగెను. ఆ బ్రాహ్మణుడు ఎముకను తననుండి లాగుకొనును అను అనుమానము కుక్కకు కలిగెను. అది గుర్రుపెట్టుచు ఆ బ్రాహ్మణుని తప్పించుకొని పారిపోసాగెను." ఇది విని అక్కడ కూర్చున్న వారందరు పకపక నవ్వసాగిరి.

-వార్తాలాపము

ఆశ్రమంలో రామాలయంలో ప్రతిరోజు సాయంత్రము 4 గం. నుండి 5 గం. వరకు శ్రీ ఎస్. సుబ్బారావు (యోగా టీచర్) గారిచే యోగ శిక్షణ తరగతులు నడుపబడుచున్నవి. ఆసక్తి గలవారందరు పాల్గొనవచ్చును.

# సత్సంగ సౌరభం

-శివ ప్రసాద్

(ది. 31-10-2009 శ్రీ బృందావనంలో పరమహంస పరివ్రాజక పూజ్యపాద శ్రీశ్రీశ్రీ 108 దండినిర్మలానందగిరి స్వామివారి అనుగ్రహ భాషణకు సంక్షిప్తరూపం.)

గాలిపటం ఎంత ఎత్తున ఉన్నా ఫరవాలేదు. దారం మన చేతులో ఉంటే చాలు, గాలిపటం మన చేతిలో ఉన్నట్లే. నామికి నామానికి తేడాలేదు. భగవన్నామం ఎవరి చేతిలో ఉంటుందో భగవంతుడు వారి దగ్గరే, అక్కడే ఉంటాడు.

పోతనామాత్యుడు భాగవతంలో చేతులారంగ శివుని పూజింపడేని, నోరునొవ్వంగ హరికీర్తినుడువడేని..." అంటాడు. భగన్నామం నోరు నొప్పి పుట్టేలా చెయ్యాలి.

మనందరం జన్మరాహిత్యం కావాలని కోరుకుంటున్నాము. రాహిత్యం చేసుకోవాలి అంటే ముందు జన్మకు కారణం తెలుసుకోవాలి. కారణం తెలుసుకుంటే, కార్యం పోతుంది. జన్మ ఎందువలన వచ్చింది? కర్మవలన. కర్మ ఎందువలన వచ్చింది? రాగద్వేషాలవల్ల. రాగద్వేషాలు ఎలా కలుగుతున్నాయి? శోభనా శోభన బుద్ధి వల్ల, ద్వైత బుద్ధి వల్ల. ద్వైత బుద్ధి ఎందు వలన కలుగుతున్నది? అజ్ఞానం వలన. అజ్ఞానం ఎందువలన వచ్చింది? అది అనిర్వచనీయం పొమ్మన్నారు. ఇది సురేశ్వరాచార్యులవారు నైష్కర్మ్య సిద్ధిలో చెప్తారు.

అజ్ఞానం పోవాలంటే జ్ఞానం కావాలి. అజ్ఞానం, ఎప్పటినుండి ఉన్నా సరే,జ్ఞానం రాగానే పోతుంది. మనం ఇంటి తలుపులు, కిటికీలు అన్నీ మూసి యాత్రలకు వెళ్ళి చాలకాలం తరువాత తిరిగి వచ్చాము. ఆ ఇంట్లో ఎప్పటినుంచో చీకటి ఉన్నది. అయినా సరే ఒక అగ్గిపుల్ల గీస్తే చాలు. చీకటి పోయింది. ఒకడు నిద్రపోతున్నాడు. వాడు ఎప్పటినుండి నిద్రపోతున్నా సరే తట్టితే నిద్ర లేస్తాడు.

భగవంతుడి దగ్గరకు పోతే అజ్ఞానం పోదు. జ్ఞానులు తత్త్వదర్శినులు అయినవారి ద్వారా మాత్రమే జ్ఞానం కలుగుతుంది. భగవంతుడు కూడ జ్ఞానం కావాలంటే వాళ్ళ దగ్గరికే పో అన్నాడు. ఆ పోర్ట్‌ఫోలియో వాళ్ళది. ఎంతో పుణ్యం చేసి ఉంటేనే గురువు దగ్గరకు వస్తాము. గురుపాదాలను ఆశ్రయిస్తాము. మన

వెంబడే విష్ణుదేవతలు కూడ వస్తారు. రాముడు, కృష్ణుడు కూడ వెంటాడతారట. జ్ఞాని అయి మనల్నే మించి పోతున్నాడే అని వాళ్ళు వెంటాడుతారు.

గురువు ఏం చేస్తాడు? మిగిలిన వాళ్ళందరికీ దృష్టాంతము ఉంది కాని, గురువుకు దృష్టాంతము లేదు. పరుసవేది ఇనుమును బంగారంగా చేస్తుంది. కాని ఆ బంగారం పరుసవేది కాలేదు. కాని గురువు తన దగ్గరకు వచ్చిన శిష్యుణ్ణి గురువుగా చేస్తాడు. గురువును మించిన వస్తువు లేదు. నువ్వు ఎంతని అనుకుంటావో అంతకన్నా పెద్దవాడు. గురువు తన దగ్గరకు వచ్చిన శిష్యుణ్ణి తన స్వరూపంగా చేస్తాడు.

జ్ఞానం అంటే దృఢాపరోక్ష జ్ఞానము. సమాధి కావాలి. ఏం సమాధి?

**స్థిత ప్రజ్ఞస్య కాభాషా సమాధి స్తస్య కేశవ**
**స్థితధీః కిం ప్రభాషేత కిమాసీత వ్రజేత కిం?** (-భగవద్గీత)

అని అర్జునుడు నాలుగు ప్రశ్నలు వేశాడు. సమాధిలో లేనప్పుడు స్థిత ప్రజ్ఞుడు ఎలా మాట్లాడుతాడు? సమాధిలో ఎలా కూర్చుంటాడు?

యోగ సమాధివేరు, ఈ సమాధి వేరు. పతంజలి యోగసూత్రాలలో చెప్పిన సమాధి యోగసమాధి. అది అనివృత్త సమాధి. రమణమహర్షి దీనిని సత్యసమాధి అన్నారు. సత్యసమాధిలో యోగం ఉన్నది. జ్ఞానదేవులు యోగసమాధిలో అజ్ఞానం బీజరూపంలో ఉంటుంది, అక్కడనుంచి లేవగానే అది విజృంభిస్తుంది అని చెప్తారు. సమాధి అంటే సమ + అధి. ఎవరి బుద్ధి బ్రహ్మలో ఐక్యమై ఉంటుందో, విషయాకారవృత్తి తొలగి బ్రహ్మాకారవృత్తి కలిగి ఉంటుందో, వారి బుద్ధికి సమాధి కలుగుతుంది. బుద్ధి జడము. ఆత్మ చైతన్యం. అద్దం నీ ముఖాన్ని చూపిస్తుందా? అది మట్టి. అద్దానికి వెనక పాదరసం ఉండాలి. అప్పుడే అద్దం నీ ముఖాన్ని చూపించ గలుగుతుంది. అద్దంలో సూర్యుణ్ణి చూశాను అంటారు. సూర్యుడు లేకపోతే, అద్దంలో సూర్యుడు ఉండడు. అలాగే నీ బుద్ధిని ప్రచోదింప చేసేది "నేను". 'ధియోయోనః ప్రచోదయాత్' అందువలన ఈ బుద్ధి, బ్రహ్మాకారవృత్తి కలిగిన బుద్ధి, సమ అంటే బ్రహ్మమును దర్శించ గలుగుతుంది. ఈ బుద్ధి వికారములు లేని, ప్రపంచ వాసనలు తొలగిన బుద్ధి, శుద్ధ బుద్ధి. మలిన బుద్ధి అంటే ప్రపంచ వాసనలు ఉన్నది. ఆ వాసనలను సంస్కరించుకోవాలి.

మలిన బుద్ధి ఉన్నవారు మందాధికారులు. ఉపాసన, కర్మల వలన బుద్ధి సంస్కరింప బడుతుంది. సంస్కరింప బడిన బుద్ధిలో నీ రూపం

సాక్షాత్కరిస్తుంది. అయితే అక్కడ తిరగబడి ఉంటుంది. అక్కడ కూడ త్రిపుటులు ఉంటాయి.

భగవంతుడు భగవద్గీతలో జ్ఞానీత్వాత్మైవ మే మతం అంటాడు. జ్ఞాని సమాధిలో దేనిని తెలిసికొంటాడో అది దృశ్యం కాదు. అది 'నేనే' అని కాని 'తానే' అని కాని అర్థం చేసికోవాలి. మరచిపోయిన దానిని జ్ఞాపకం చేసేది శాస్త్రం. నీవు నీ రూపం మరచిపోయావు. ఇది నీకు ఎవరు చెప్తారు? దేవాలయంలో దేవుడా? దేవుడు చెప్పడు. చెప్పేవాడు ఒక్కడే. గురుబ్రహ్మ. అందుకే గురువు భగవంతుడి కంటే అతీతుడు. పరబ్రహ్మ. ఇంకా చెప్పాలంటే 'నేనే' ఆ పరబ్రహ్మము. ఆ పరబ్రహ్మ నీ అజ్ఞానాన్ని నివర్తింప చేస్తాడు.

ఈ బయట ఉండే ఆకాశం శీతవాతాదులను నశింప చేయలేదు. గృహంలో ఉండే ఆకాశమే నివృత్తి చేస్తుంది. అలాగే పరబ్రహ్మ నేరుగా నీ అజ్ఞానాన్ని నివృత్తి చేయదు. గురువుగా అవతరించి వచ్చిన పరబ్రహ్మము నీ బుద్ధిని సంస్కరిస్తాడు. నీ అజ్ఞానాన్ని నివర్తిస్తాడు.

ఆ స్థిత ప్రజ్ఞుడు ఎలా ఉంటాడు? అని అర్జునుడు అడిగాడు. భగవంతుడు చెప్తున్నాడు.

**ప్రజహాతి యదాకామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్**
**ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థిత ప్రజ్ఞస్తదోచ్యతే ॥** (-భగవద్గీత)

స్థిత ప్రజ్ఞుడు ఎలా ఉంటాడు అనేది చెప్తున్నాడు. ఏది ఉండకూడదో అది లేకుండా చేయటం నిర్మూలన పద్ధతి. ఏది ఉండాలో అది ఉండేలా చేయటం నిర్మాణ పద్ధతి అంటారు. మహాత్ములు జ్ఞానానుభూతిని కల్గించటానికి ఈ రెండు విధానాలనూ అవలంబిస్తారు.

బుద్ధ భగవానుడు భిక్షకు వెళ్ళేవాడు. ఆయన అయిదు ఇళ్ళ దగ్గర మాత్రమే భిక్ష స్వీకరించేవాడు. ఒకామె నేను రోజూ భగవానుడికి భిక్షపెడుతున్నాను కదా!, ఈ రోజు భగవానుడి దగ్గర భిక్ష అడిగి తీసుకుంటాను అనుకుందట. ఏ భిక్ష? ఆధ్యాత్మిక భిక్ష. గృహస్థులకు సన్యాసులకు మధ్య ఎంతో తేడా ఉంటుంది. అందుకని జ్ఞానభిక్ష వారే (సన్యాసులే) పెట్టాలి. భోగ భిక్ష వాళ్ళు పెట్టరు. ఆమె బుద్ధ భగవంతుణ్ణి జ్ఞాన భిక్ష పెట్టమని అడిగింది. ఆయన నేను మళ్ళీ వచ్చే సోమవారం వస్తాను. ఈ రోజు మొదలు మరల నేను వచ్చే లోపల ఆ మూల ఉన్న టెంకాయ చిప్పలపైన పీచు, దూగర అంతా తీసేసి వాటిని శుభ్రం చేసి ఉంచండి అన్నారు. -సశేషం

# సంత్ నామదేవ్ చరితామృతం

(గతసంచిక తరువాయి) -మనోజ్ కుమార్

అన్ని మార్గాలవారు నామదేవుల నామమార్గంలో నడిచారు, పంఢరి వాసి, శైవమత దురభిమాని అయిన ఒక్క నరహరి సోనార్ తప్ప. అతడు ప్రొద్దుటే లేచి స్నానం చేసి మల్లికార్జున స్వామిని దర్శించి మనసారా ఆయనను ధ్యానించి, పూజించి తన వృత్తిలో నిమగ్నమయ్యేవాడు. ఏళ్ళ తరబడి పంఢరిలో ఉంటూ కూడా ఒక్కసారైనా అతని నోరు హరి అన్ననామం పలకలేదు. పొరపాటునన్నైనా అతడు పాండురంగడి గుడివైపు చూడలేదు. నామదేవుడి పక్క ఇల్లే అతడిది. అయినా నామదేవుడి భజన అతని మనస్సుపై ఏ విధమైన ప్రభావమూ చూపించలేదు. అతడి శివస్తోత్రం వింటుంటే నామదేవుడికి ఒడలు పులకరించేది. ఇంత ఉత్తమ భక్తుడు అద్వైతం దారి వదలి హరిహరుల భేదం పాటిస్తూ ద్వైతం అనే దారి పట్టాడే! అతని ఈ సంకుచితత్వం ఎలా వదులుతుందా అని నామా బాధపడేవాడు.

ఒకసారి ప్రాతఃకాల సమయంలో జ్యోతిర్లింగ స్తోత్రం పఠిస్తూ స్నానం చేస్తున్న నరహరిని చూచి ప్రక్కనే స్నానం చేస్తున్న నామదేవుడు పరిసాతో....

**నామ -** మహరాజ్! ఎలాగైనా సరే ఒక్కసారి ఈ స్వర్ణకారుడికి పాండురంగడి దర్శనం కలిగించండి.

**పరిసా -** తన మెడలో వేసుకున్న ముత్యాలహారం కనబడనట్లు అతనికి తన హృదయంలో ఉన్న పాండురంగడు కనబడటంలేదు. దానికి ఎవరు మాత్రం ఏమి చేయగలరు?

**నామ -** మీరు విప్రోత్తములు. జ్ఞానసంపన్నులు. శంకరుల అద్వైతాన్ని అతనికి బోధించటానికి మీరే అన్ని విధాలా తగినవారు.

**పరిసా -** కాని మహరాజ్! అహంకారంతో మూసుకు పోయిన విప్రుల కళ్ళను తెరిపించింది మీరే. ఇటువంటి మహత్కార్యం మావంటి ఇతరులకు సాధ్యమయ్యేది కాదు. కనుక మీరే దీనికి పూనుకోవాలి.

**నామ -** ఆ క్షణం త్వరలో రావాలని అందరం విఠలుడిని ప్రార్థిద్దాము.

దేవగిరిలోని ఆగర్భ శ్రీమంతుడైన గోపాలసెట్టి కస్తూరే అనే షాహుకారుకి సంతానం లేదు. ఎన్ని నోములు నోచినా, వ్రతాలు చేసినా, ఎందరు దేవతలకు మ్రొక్కుకున్నా సంతానం కలగలేదు. తనకు వంశాకురం కలిగితే

పాండురంగణ్ణి దర్శించుకుంటానని మ్రొక్కుకున్నాడు. పాండురంగడి దయవలన ఆయనకు పుత్రుడు కలిగాడు. ఆయన ధర్మపత్నితో, బంధువులతో సహా పంఢరి వచ్చాడు. పాండురంగడికి రెండు శేర్ల బంగారంతో, లక్షలు విలువ చేసే వజ్రవైఢూర్యాలు పొదిగిన, నభూతో నభవిష్యతి అన్నట్లుగా ఉండే వడ్డాణం చేయించాలని సంకల్పం కలిగింది. ఆయన ఈ విషయమై నామదేవుడితో సంప్రదించాడు. నామదేవుడు ఆ ఊళ్ళో నరహరి ఆరితేరిన స్వర్ణకారుడు, మంచి నమ్మకస్తుడు పైగా భక్తుడు అని చెప్పాడు. సాయంత్రం అందరూ నరహరి ఇంటికి వెళ్ళి నగ విషయమై మాట్లాడారు. అంతా అయ్యాక, నరహరి...

**నర** - సరే నిలబడండి. మీ నడుము కొలతలు తీసుకుంటాను.

**సెట్టి** - అయ్యో! నా మతి మండా! నగ ఎవ్వరికో చెప్పలేదు కదూ? నేను పాండురంగడికి మ్రొక్కుకున్నాను. నగ ఆ స్వామి నడుము కొలత ప్రకారం చేయండి. (నరహరి సోనార్ ఆలోచనలో పడటం చూసి) ప్రతిఫలం గురించి బెంగ పెట్టుకోకండి. మీరు అడిగిన దానికన్నా బాగా ఎక్కువే ఇస్తాను. నగ మాత్రం న భూతో న భవిష్యతి అన్నట్లు ఉండాలి. ఇది నరహరి సోనార్ చేసింది అని అందరూ మెచ్చుకునేలాగా ఉండాలి.

**నర** - (నీళ్ళు నములుతూ) నా ఆలోచన కూలిగురించి కాదు, నా వ్రతం గురించి. (అతడు తన శివోపాసన వ్రతం గురించి చెప్పి) మీ దేవుడి నడుము కొలతలు తెచ్చి ఇస్తే నగ ఐదవనాటికి మీ చేతుల్లో పెడతా. పనితనం చూశాక కూలి ఎంత ఇవ్వటం అనే నిర్ణయాన్ని మీకే వదిలేస్తున్నాను.

సెట్టిగారితో పాటు పరిసాభాగవతార్ కూడా బయలుదేరాడు. అతడికి వెంటనే సౌంజ్ఞ కలిగింది, 'నరహరి అదృష్టం పండింది, అతడి భ్రమ తొలిగే క్షణం దగ్గర పడింది' అని. పూజారి వద్ద జందెం కొని పాండురంగడి నడుము కొలత తీసుకొని దారం ముడివేసి సెట్టిగారికి ఇస్తూ మనస్సులో అనుకున్నాడు, "పాండురంగా ఈ చిక్కుముడి నీవే విప్పాలి" అని.

ఐదవనాటికి నగ సిద్ధం అయింది. తీరా పాండురంగడి నడుముకు పెడితే నాలుగు వేళ్ళు పెద్దదిగా ఉంది. కొలతలు తగ్గించి ఇచ్చారు. ఐదవ రోజుకు నగ సిద్ధం. మళ్ళీ పాండురంగడికి పెట్టి చూశారు. ఈసారి నాలుగు వేళ్ళు తక్కువై నడుముకు చాలలేదు. సెట్టిగారు ఆశ్చర్యపోయాడు. ఆయన 'నరహరే స్వయంగా కొలతలు తీసుకుంటే మంచిది. ఇది మన పనికాదు,

ఎక్కడో తప్పి ఉంటాము' అనుకున్నాడు. పరిసాగారికి ఈ భాగోతం పూర్తిగా అర్థం అయింది. నరహరిపైన గురుకృప వర్షించే సమయం దగ్గర పడింది. అతను తనలో తను నవ్వుకున్నాడు. అందరూ నామదేవుడి వద్దకు వెళ్ళారు. నామదేవుడు అంతా విని "మంచికో చెడుకో కులవృత్తి అంటూ ఒకటి ఉంది కదా! పరిసాగారూ అతను తీసుకోవలసిన కొలతలు మీరు తీసుకుంటే ఎలా? ఎవరి పని వారే చేయాలి. అతనే కొలతలు తీసుకోవటం మంచిది. రండి నరహరి దగ్గరకు వెళదాం'' అన్నారు. అందరూ నరహరి ఇంటికి వెళ్ళారు. నామదేవుడు నరహరి దర్శనం చేయకపోతే పోనీ కొలిచేది చేతితో కదా. కళ్ళతో కాదు కదా! కళ్ళకు గంతలు కట్టుకుని కొలతలు తీసుకుంటే సరి, అతని వ్రతం చెడదు. మన పని పూర్తి అవుతుంది అని సలహా ఇచ్చాడు. నరహరికి ఈ ఉపాయం బాగ నచ్చింది. తన వ్రతం చెడదు. మంచి లాభసాటి బేరం చేయిదాటిపోకుండా ఉంటుంది, ఉభయ తారకంగా ఉందని ఒప్పుకున్నాడు. ఊడిపోకుండా కళ్ళకు గట్టిగా గంతలు కట్టుకున్న నరహరి ఒక చేతిని పరిసా, రెండవ చేతిని సెట్టిగారు పట్టుకుని నడిపిస్తుంటే నరహరి గుడివైపు నడిచాడు. ఈ చిత్రాన్ని చూసి అక్కడ పోగైన జనం 'వీడిది ఎంత పరమ దరిద్రం. పాండురంగడి దగ్గరకు పోతూ కూడా కళ్ళకు గంతలు కట్టుకున్నాడు. పరమ దౌర్భాగ్యుడు అని ముక్కుమీద వేలు వేసుకున్నారు. తడుముకుంటూ నడుస్తున్న నరహరి గరుడమంటపం దగ్గర తాబేలు కాలు తగిలి పడబోయి ఆపుకున్నాడు. 'జాగ్రత్తగా నడవండి, నా చేయి వదలకండి' పరిసా హెచ్చరించాడు.

ఇద్దరూ గర్భగుడిలో ప్రవేశించారు. నరహరిని విగ్రహం దగ్గరకు తీసుకుని వచ్చి ఇక కొలతదారం తీసి కొలతలు తీసుకోండి అంటూ పరిసా నరహరి చేతిని విగ్రహానికి తాకించాడు. నరహరి నడుముకట్టులో ఉన్న కొలతదారం తీసి కొలతలు తీసుకోబోయాడు. పాండురంగడి స్పర్శ తగలగానే విద్యుత్తు ప్రవహించినట్లై ఒక్కసారి ఒళ్ళంతా ఝల్లుమని పులకరించింది. నరహరి విగ్రహన్ని చక్కగా తడిమాడు. వెంటనే కొద్ది క్షణాల పాటు అతడు స్థాణువైనాడు. అతడి చెవిలో ఓంకార నాదం, శంఖాలు ఊదుతున్న ధ్వనులు, ఘంటానాదంతో పాటు శివుడు ఢమరుకం ఢిం ఢిం ధ్వనులు హోరెత్తిస్తున్నాయి. అతడికి రోమాంచం కలిగింది. ఉహూ, ఇది పాషాణ శరీరం కాదు, పట్టులా మృదువుగా ఉన్నది. ఏదో అనుమానం కలిగి నరహరి, మూర్తిని అంతా తడిమి చూశాడు.

-సశేషం

# కృష్ణతత్వము, ప్రేమ యోగము

- సుషుమ్న ప్రసాద్

**నమామి శ్రీకృష్ణం సజలజలద శ్యామలతనుం**
**భజామి శ్రీకృష్ణం మధురమధురం తస్యచరితమ్**
**వ్రజామి శ్రీకృష్ణం శరణ మహమద్యాజి కృపయా**
**ఘనశ్యామః శ్రీకృష్ణో వసతు హృద్ధామ సతతమ్**

నిరాకారుడు, నిర్వికారుడు నిర్గుణుడైన భగవానుడు, తాను సృజించిన మానవాళి సంరక్షణార్థము, భూభారాన్ని తగ్గించటానికి, అనేక సందర్భాలలో భువి మీద అవతరించాడు. భగవద్గీతలో గీతాచారుడు సెలవిచ్చినట్లు

**యదాయదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।**
**అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ ॥**

(4 అ. 7శ్లో॥)

**పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం**
**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥**

(4 అ. 8శ్లో॥)

7శ్లో॥ ఓ అర్జునా! ఎప్పుడెప్పుడు ధర్మమునకు కీడుగలుగుచున్నదో, అధర్మమభివృద్ధి చెందుచున్నదో, అప్పుడెల్లా నేను ఉద్భవించుచున్నాను.

8శ్లో॥ సాధు పురుషులను సంరక్షించుటకు, దుష్కృత్యములు చేయువారిని నశింప చేయుటకు, ధర్మ సంస్థాపనార్థము ప్రతి యుగమునందు నేను అవతరించుచున్నాను.

అలా భూభారమును తగ్గించుటకు సర్వవ్యాపకుడైన భగవానుడు అనేకావతారములను ధరించాడు. అందులో దశావతారములను ప్రాముఖ్యముగా పేర్కొంటారు. భగవంతుడు తన సర్వవ్యాపకత్వమును, సర్వసమానత్వమును నిరూపించుకొనుటకు మీన, కూర్మ, వరాహ, నృసింహ మూర్తులుగ, అవతరించి, జీవకోటిని సంరక్షించాడు. భగవద్గీత విభూతి యోగములో వివరించినట్లు, సకలజీవరాశి తన దివ్య ప్రతిరూపములే అన్న సత్యాన్ని జలచరములైన మత్స్య, కూర్మములుగ, భూచరమైన వరాహ మూర్తులుగా ఆవిర్భవించి నిరూపించాడు. తరువాత మానవ, జంతు సమ్మేళనమైన నరసింహస్వామి, కురుచ రూపంలో వామన మూర్తిగా అవతరించి పరిణామ సిద్ధాంతాన్ని(Theory of Evolution) కూడ సూచించినట్లు

స్ఫురిస్తుంది. కాని దశావతారములలో ఈ అవతారములు ఒక ప్రయోజనాన్ని సాధించిన తరువాత నిష్క్రమించాయి. దశావతారములలో, రామావతారము, కృష్ణావతారము పరిపూర్ణావతారములు. అందులో శ్రీరామచంద్ర ప్రభువు ధర్మావతారము. శ్రీకృష్ణ పరమాత్మ ప్రేమావతారము. కృష్ణావతారము ప్రేమ తత్వమునకు ప్రతీక.

శ్రీరామచంద్ర ప్రభువు పరిపూర్ణ, ఆదర్శ మానవుడుగా, మానవతా ధర్మాన్ని, కర్తవ్యాన్ని ఎలా నిర్వర్తించాలో ప్రత్యక్షంగా ఆచరించి నిరూపించాడు. తాను నడిచిన మార్గంలో నడవమని సూచించాడు. శ్రీ కృష్ణావతారము దివ్యత్వము, మహిమ, ప్రేమతత్వముతో నిబిడీకృతమై ఉన్నది. మన కృష్ణ స్వామి భువిపై, అవతరించుటకు ముందే, తన మహిమను ప్రదర్శించటము ప్రారంభించాడు. భగవంతుడు తన ప్రణాళిక ప్రకారము అవతారములను ముందే నిర్ణయించు కొంటాడు. అందు చేతనే ఈ అవతారాలకు (connecting link) ఉంటుంది. రామావతారములో స్వామి దివ్య మోహన రూపము చూసి, పరవశించి, గాఢాలింగనము ప్రసాదించమని కోరిన మునీశ్వరులకు ద్వాపరయుగంలో, అలాంటి అవకాశాన్ని ఇస్తానని అభయమిచ్చాడు శ్రీరామచంద్ర ప్రభువు. అందుచేతనే త్రేతాయుగంలోని మునీశ్వరులు, ద్వాపర యుగంలో గోపికలుగా జన్మించారు. శ్రీకృష్ణ పరమాత్మగా అవతరించి, వారి కోరికల్ని నెరవేర్చాడు. అలాగే కృతయుగంలో ముద్దులు మూటగట్టే వామన మూర్తిని చూచిన బలిచక్రవర్తి పుత్రిక రత్నావళికి ఈ బాలునికి స్తన్యమిచ్చే మహదవకాశం లభిస్తే, ఎంత బాగుండుననిపించింది. తరువాత మూడడుగుల చోటివ్వమని కోరి, త్రివిక్రముడై, ఏ నేరమూ చేయని తన తండ్రి బలిచక్రవర్తిని పాతాళానికి అణగత్రొక్కి, నాగ పాశంతో బంధించిన వామన మూర్తిని చూచి, పాలు కాదు, ఇతడికి విషమిచ్చి సంహరించాలన్న క్రోధం కలిగింది. మరి స్వామికి ఆ కోరికలను తీర్చక తప్పదు కదా! ఆ రెండు కోరికలను సమన్వయ పరచి, ద్వాపరయుగంలో కృష్ణ పరమాత్మ తనకు పూతనగా విషస్తన్యమిచ్చే అవకాశమును ఆమెకు ప్రసాదించాడు. ఆమె కోరిక తీర్చి ఆ పాపజాతి పూతనను ప్రేమతత్వముతో కృష్ణ పరమాత్మ తనలో ఐక్యము చేసుకొన్నాడు. అలాగే త్రేతాయుగంలో, శ్రీరామచంద్ర ప్రభువు పట్టాభిషేక సమయంలో, ఏమి వరము కావాలో కోరుకోమంటే, జాంబవంతుడు స్వామితో ముష్టియుద్ధం చేయాలనే కోరికను వ్యక్తం చేశాడు. -సశేషం

# శ్రీకృష్ణ కర్ణామృతం

- సుశీలా ప్రసాద

నీలాల నింగిలో పూర్ణ చంద్రుడు తన వెన్నెలలనే మల్లెల పాన్పుపై అందంగా నవ్వుతూ కూర్చున్నాడు. చుక్కలన్నీ చుట్టూ చేరి తనివితీరా వాని అందాలను చూస్తూ మురిసిపోతున్నాయి. బృందావన వీధులలో ఆ పూర్ణచంద్రుని ధిక్కరిస్తూ అందం అనే పదానికి అర్థం తానేననిపించే సౌందర్యరాశి నందనందనుడు వల్లవ సుందరీ బృందమధ్యంలో అఖండ తేజోరాశి అయి ప్రకాశిస్తున్నాడు. ఆ తావుకి వచ్చిన మదనుడు స్వామి దివ్య మంగళమూర్తిని చూస్తూ అట్టే నిలిచిపోయాడు. ప్రాణ విభునితో పరమానందంగా విహరిస్తున్న వ్రజకాంతలను చూస్తూన్న మన్మథునికి తనకి వారప్పగించిన పని గుర్తు వచ్చింది. వారు వెల్లడించిన తమతమ అంతర్గత భావాలను లేఖలుగా మలచి ఆ తరుణుల కడగంటి చూపులలో ఇమడ్చగా అవి విరిసిన సుమాలై స్వామి దివ్య చరణారవిందాల మ్రోలవాలి దేవదేవుని అర్చించసాగాయి, ఒక్క క్షణమైనా విరామం లేకుండా.

"హే జగన్నాథా! సర్వేశ్వరుడవు, సర్వవ్యాపివి, సర్వజ్ఞుడవు పరమాత్మ స్వరూపుడవైన నిన్ను తెలుసుకోలేక మాలో ఒకడై ఆటపాటలతో గడుపుతూ మమ్మల్ని ఆనందాబ్ధిలో ఓలలాడిస్తున్న నిన్ను యశోద కొడుకువలె తలిచే మా అజ్ఞానాన్ని మన్నించు స్వామీ! నీ హస్త స్పర్శలో, నీ వేణుగాన శ్రవణంతో అడవులలో నీవెంట తిరుగుతున్న నువ్వు పెంచి పోషించిన నోరులేని ఆ గోవులు మాకంటే ధన్యతములు కదా! నోరున్న మేము ఏ క్షణం అయినా నీ స్మరణము మరిచి సంసారంలో చరిస్తామేమో అన్న మా భయాన్ని తీర్చేందుకు నీ వరదాయకమైన వరద హస్తాన్ని మా మస్తకాలపైన ఉంచు దేవదేవా! పగటి వేళలలో నువ్వు అరణ్యాలలో తిరుగుతున్నపుడు దారిలోని కఠినమైన శిలలు తాకి నీ పాదాలు ఎంత నొచ్చుకుంటున్నాయోనని బాధపడుతున్నామేగాని నీ చరణ స్పర్శలో ఆ శిలలు కరిగి వెన్నలా మెత్తనై నీకు సుఖాన్ని ఇస్తాయని, నీ మృదు స్పర్శతో పుడమి పులకించి ధన్యమై పోతుందని గుర్తించలేక పోతున్నాము కదా! నీతో ఆటలు విహారాలు నీ నర్మగర్భమైన మాటలు నీ చూపులు అనే బీజాలు మా మనస్సులలో నాటుకుపోయి అంకురించి నీపైన మాకు గల ప్రేమ అనే నీటితో తడపబడి మానులై మహావృక్షాలై తిరిగిరాని పరమ పదమనే ఫలాలను మాకందించేందుకు దోహదం చేసే నీదివ్య పాదకమలాలను మా హృదయాలపై మోపి శాశ్వతమైన బ్రహ్మానందాన్ని ప్రసాదించు స్వామీ!"

లీలా కిశోరుడైన నీలమోహనుడు అనన్యగతికంగా తననాశ్రయించిన

గోపికా హృదయాలను గమనించి వారివంక అధికానురాగంతో చూశాడు. ఆ చల్లని చూపులలో తమకి సమాధానం లభించగా తృప్తి చెందారు గోపికలు. చాటుగా నిలిచి చూస్తున్న మన్మధుని సాదరంగా గోపీ వల్లభుడు చూసేసరికి అతడికి తన పనికి ఫలితం దక్కిందని ఆనందం కలిగి భయం తీరి "దేవ దేవా! నీ బిడ్డగా నన్ను మన్నించి నా దోషాన్ని పరిహరించి సశరీరుడనై సంచరించే భాగ్యాన్ని ప్రసాదించు స్వామీ!" అని వినయంగా వేడుకున్నాడు. శ్రీకృష్ణుడు చిరునవ్వుతో 'నా ఇంటనే నా కుమారుడవై జన్మించి వర్ధిల్లగలవులే" అని దయ చేశాడు. తమ కడగంటి చూపులనే మదన లేఖలనే పూజాసుమాలుగా అర్పించిన గోపీరమణులచేత సేవించబడే ఆ శ్రీకృష్ణ స్వామిని మనము ఆశ్రయించెదముగాక! *

## వ్రీడా దానము

నలుగురి మధ్యను కూర్చునియున్నప్పుడు ఎవరైనా యాచకులు వచ్చినచో, ఇవ్వకపోయినట్లైతే బాగుండదని సిగ్గుతో అనేకమంది దానము చేయుదురు. అది వ్రీడా దానము. ఈ విషయమున ఈ దృష్టాంతము వినదగినది.

ఒక నగరమున ఒక ధనవంతుడగు వ్యాపారస్తుడు ఉండెను. ఒక రోజున అతడు తన బండి కట్టించుకొని బజారులోనికి వెళ్ళుటకు సిద్ధముగా ఉండెను. అంతలో ఒక దరిద్రుడు ఆకలితో వచ్చి అన్నమునకు డబ్బులేదనియు, ఒక డబ్బు ఇవ్వమనియు ప్రార్థించెను. ఆ ధనవంతుడు అతనిని తిట్టి తన బండి ఎక్కి బజారులోనికి పోయెను. బజారులో అతని బండి వద్దకు బేరగాళ్ళును, ఇతర గృహస్థులును తమ తమ పనుల కొరకు వచ్చిరి. సరిగా ఆ సమయమునకు వెనుకటి బిచ్చగాడు అక్కడికి వచ్చి ఒక డబ్బు ఇవ్వమని అడిగెను. ధనవంతుడు తన నలువైపుల ఉన్న బేరగాళ్ళను, గృహస్థులను పరిశీలించి ఆ ముష్టివానికి వెంటనే నాలుగు అణాలు ఇచ్చెను. కాలాంతరమున ఆ ధనవంతుడు మృతి చెందెను. యముని ఎదుట న్యాయార్థము నిలబడెను. యముడు ప్రశ్నించెను. "ఈ ధనవంతుడు దానాది పుణ్యకార్యములు ఏమైనా చేసెనా?" చిత్రగుప్తుడు సమాధానము చెప్పెను. "ఈతడు దానాదులు ఏమియును చేయలేదు కాని, ఒకప్పుడు ఒక దరిద్రునకు నాలుగు అణాలు ఇచ్చెను. యముడు అడిగెను. "నాలుగు అణాలు ఎట్టి పరిస్థితులలో ఇచ్చెనో తెలుసుకొనవలసి ఉన్నది."

చిత్రగుప్తుడు ఆ సంగతిని సవిస్తరముగా వివరించెను. మరియును అతడు ఇట్లనెను. ఈ విధముగా అతడు చేసిన దానములు చాల ఉన్నవి. అంతట యముడు చెప్పెను. 'ఇట్టి దానములు అసలైన దానములుగా చెప్పబడవు. దీని వలన అతనికి ప్రయోజనము సిద్ధించదు. ఇవి దానములు కావు. వ్రీడా దానములు మాత్రమే. కీర్తి కొరకు చేసిన దానమునకు ప్రతిఫలము లభించదు. దంభముతో కీర్తి కొరకు చేసిన దానము కూడ దానము కాదు.' -వార్తాలాపము

# మౌనధ్యాన సప్తాహశిబిరం

-రమణ ప్రసాద్

గురువుగారు ఏమి నాయనా? (అనగానే గురువుగారికి సాష్టాంగ నమస్కారం చేశాడు.) ఏం అర్థమైంది?

అతడు - నా కులాన్ని నేనే అడ్డుపెట్టుకున్నాను. కులం దేహానికా? ఆత్మకా? ఆత్మకు కులంలేదు కదా. అని విచారణ చేశాను. నాలో ఉన్న కులాల పిచ్చి పోయింది. దానిని ఛీ ఛో అని ఛీత్కరించాను, పొమ్మన్నాను.

మన గురుదేవులు ఏమన్నారు? కాకి రెట్టలోని వటబీజం నుంచి మొక్కమొలిచింది. ఫరవాలేదులే అనుకుంటే దాని వేళ్ళు గోడలోపలికి వెళ్ళి భవనాన్ని కూలుస్తాయి. మనలో వీషబీజం ఉంటే దానిని ధ్యానాగ్నిలో దగ్ధం చెయ్యాలి. "ధ్యానాగ్ని దగ్ధ కర్మాణి" అన్నారు బాబూజీ మహరాజ్. గురుదేవులు ప్రసాదించిన నామంపైన విశ్వాసం ఉంచి ధ్యానం చేయాలి.

గురుదేవులు నన్ను తిట్టారు అనుకుంటే గురుదేవులు నేను తిట్టింది నిన్నుకాదురా నీలో ఉన్న బలహీనమైన మనస్సును తిట్టాను అని చెప్పేవారు. ఎవరండీ అట్లా మనని కాపాడేది? కన్నతల్లి కూడా చంటిపిల్లను ఎలా చూచుకోవాలో తెలిపేవారు, ప్రసాద గురుదేవులు.

**చరణ ధూల్ తక్ ఝుక్‌నేదో -** కృష్ణ పరమాత్మ పెట్టెలో పెట్టె, మళ్ళీ అందులో ఇంకొక చిన్న పెట్టె అందులో ఒక బుల్లి పెట్టెలో భక్తుల పాదధూళిని పెట్టి ఆ పాదధూళిని పూజ చేసికొనేవాడు. ఆవేదన బాగా ఉంటేగాని తత్త్వం అర్థం కాదు. ఆవేదన పడితే అవగాహన అయ్యేటట్లు చూస్తాడు.

పెద్ద పెట్టెలోంచి చిన్నపెట్టెలో పెట్టాడు. సాధన అంతా ఇదే. పెద్దది దాటుతూ ఉంటే ఉన్నది అవగతమవుతుంది. ఆ చిన్న పెట్టెలో ఒక మట్టి ముద్ద. అది భక్తుల పాదధూళి. దానికి అంత విలువ ఎక్కడినుంచి వచ్చింది?

సరే స్వామికి తలనొప్పి వచ్చింది. ఎంత ఉపచారం చేసినా తగ్గలేదు. రాణివాసం అంతా గగ్గోలు పెడుతున్నారు. ఇంతలో నారద మహర్షి వచ్చారు. ఆయన అడిగితే స్వామి చెప్పారు. భక్తుల పాదధూళి రాస్తే తగ్గుతుంది అని. స్వామివారి అష్టభార్యలు, 16వేలమంది పత్నులు తమ పాదధూళి ఇవ్వటానికి సంకోచించారు. "సరే నారదా! గోపికల వద్ద ప్రయత్నించు" అంటే వారు మా స్వామికి తలనొప్పి వచ్చిందా? వెంటనే తీసుకు వెళ్ళు అని తమ పాదధూళి ఇచ్చారు. అప్పుడు స్వామి తలనెప్పి తగ్గింది. అది స్వామి లీల.

నా గురుదేవుడు ఒక్కడే. ఈ కనిపించేది అంతా గురుదేవులు

అందించిన జ్ఞానమే. నాది నేను అనే అహంకారమమకారాలు తొలగాలి. కర్తృత్వ భో క్తృత్వాలు తొలగాలి. మనస్సులోకి వచ్చే ఇతర విషయాలను రిజెక్ట్ (Reject) చేయాలి. గురుదేవులు ఇచ్చిన లక్ష్యార్థాన్ని నిలుపుకోవాలి. మనస్సు దానిని ఆస్వాదించాలి. తనువు కదిలినా నువ్వు కదలకు. అన్నిటికి సాక్షిగా ఉండు. ఉన్నది ఒక్కటే. అటువంటి గురుదేవులు తమ పాదాల చెంత మనకి ఇంతటి అవకాశం ఇచ్చారు. ధ్యానం అంటే ధి యానం అంటే మనస్సు ప్రయాణం. గురుదేవులు సూచించిన మార్గాన్ని అనుసరించటమే ధ్యానం. ఏకాగ్రతే సాధన. మనస్సే శత్రువు. ఇంద్రియములే ద్రోహి - వీటిని ప్రక్కకు తోసేసి మనస్సు పదకమలముల మీద, బుద్ధి ముఖ కమలము మీద, చిత్తము నేత్రద్వయం మీద, అహంకారము అభయహస్తం మీద ఏకాగ్రం చేసి ధ్యానం చేయాలి.

చిరు పాదముల దగ్గర నించి గురుదేవుల పూర్తి స్వరూపాన్ని మనస్సులో ముద్ర వేసికోవాలి. అప్పుడు గురుదేవులు ఎక్కడ ఉన్నారు? మన హృదయంలో బందీ అయి కూర్చున్నారు. తదనుభూతిని పొందటమే సమాధిస్థితి.

జ్ఞానంలోనే ఉన్నాం. ఈ రూపం ఇంతే... ఇది కదలనిది. కదలనివాడు మనలను కదిలిస్తున్నాడు. అతడు ఎందుకు కదలడు? అనంతంగా ఉన్నాడు కనుక ఎక్కడకు కదులుతాడు? ఎలా కదులుతాడు?

మహాత్ములు అనుభవాలు ఇస్తున్నారు? మనస్సుతో భగవంతుని పొందాలి. అందుకే జ్ఞానం. ఏది జరిగినా 'ఇది నా ప్రభువు యొక్క లీల' అని గుర్తించాలి. భగవంతుడు చర్మచక్షువులకు కనిపించేవాడుకాదు. అక్కడకు నువ్వు వెళ్ళలేవు, అందుకోలేవు అని ఉపనిషత్తులు చెబుతున్నాయి. ఈ దేహంతో ఇక్కడ ఎంత సేపు కూర్చున్నాము? మనం ఆయన సన్నిధిలోనే ఉన్నాము. ఆ హరిని గుర్తు చేసేవాడే గురుదేవుడు. వారు మన ఈతి బాధలు తీర్చటమే కాదు, ఆ బ్రహ్మపదానికే చేరుస్తారు. బ్రహ్మమునందు చరించే విధానాన్ని తెలియ జేస్తారు.

పూతన దగ్గర రెండు గుక్కలు విషపు పాలు త్రాగి మోక్షాన్ని ప్రసాదించాడు. ఆమె దుర్గంధం పోయి ఎల్లెడలా సుగంధం వ్యాపించింది. మనస్సు అంతటా వ్యాప్తమైన వస్తువును అనుభవించాలి.

మన మనస్సు శ్రీ గురుదేవుల ధారణతో నిండి ఉంది. రాముడు వేషం వేసినంత సేపు రాముడే అయిపోవాలి. గురుతత్వాన్ని ప్రతి స్పర్శలోను అనుభవించాలి. అటువంటి ఆత్మానుభూతి పొందించటం కోసమే ఈ ధ్యాన ప్రక్రియ మనం చేస్తున్నా ం. కాబట్టి అటువంటి భక్తిని, శక్తిని, సాధనా సంపత్తిని, ఆత్మ జ్ఞానాన్ని గురుదేవులు ప్రసాదించెదరు గాక! సుఖీభవ ! సుఖీభవ !!

# మాతాజీ బోధామృతం

- శివ ప్రసాద్

(గతసంచిక తరువాయి)

(2009 శరన్నవరాత్రులలో ది 28-9-09 నాడు శ్రీమాతాజీ అందించిన ప్రబోధమునకు సంక్షిప్త రూపం)

అటువంటి దేవుడు రక్షణగా ఉన్నప్పుడు మనకు వెల్తి ఎక్కడ? నీ మనస్సు చేత, నీ కామ, క్రోధాదుల చేత, నీ కాని భావనలతో నీవే కుంచించుకుని పోతున్నావు. దిగజారుతున్నావు. సద్గురు దేవుల పాదం పట్టిన తరువాత దిగజారకూడదు. మనం అలా లేకపోతే మన సాధన గమ్యస్థానం చేరదు. అటువంటి గురుదేవులు చెప్పిన మాటలు తూ.చ. తప్పకుండా ఆచరించాలి. గురుదేవులు చెప్పింది ఆచరించటానికి ఆశ్రమాలు అడ్డురావు. జనకుడు, శివాజీ, మీరాతల్లి అందరూ గృహస్థులే. అక్బరు చక్రవర్తి మనస్సులో అంతరాంతరాలలో ఉన్న భావమును తొలగించి, మీరా తల్లి ఆయన కళ్ళు తెరిపించింది. లేని దానిని పట్టుకొని, ఆ లేనిది మనలో ఉందని భ్రమించి, ఉన్న దానిని అంటే ఆత్మస్వరూపమును చూడక, మనస్సులో ఆలోచనలతో నిన్ను నీవే నమ్మవు.

**"నిన్ను నీవే నమ్మవు, నీవెవరిని నమ్మగలవు?**
**నిలకడే లేని మనసా ఎందాక నీ పయనం?**
**కాలమనే మార్గాన, కోరికల గుఱ్ఱాలెక్కి........"**

ఈ పాటంతా ఎవరి కోసం? ఇదంతా మన లీల, మనలో ఉన్న గోల. గోలపెడుతున్నది ఎవరిలో? మన మనస్సులో. భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు

**ఉద్ధరేదాత్మనాత్మానం నాత్మానమవసాదయేత్ ।**
**ఆత్మైవ హ్యాత్మనో బంధుః ఆత్మైవ రిపురాత్మనః ॥**

అంటాడు. నీ మనస్సే నీకు శత్రువు అవుతున్నది. మిత్రుడూ అవుతున్నది. నీ కిష్టమైతేనే దేనినైనా ప్రేమిస్తున్నావు. తన సుఖము, తనలో వచ్చిన ప్రేరణ తప్ప ఇతరులకోసం వచ్చినదేదీ లేదు. ఏది చేసినా మన గురించే. ఇక్కడ కూర్చున్నామంటే కూడ మన గురించే. ఎందుకు? జీవిత పరమార్థాన్ని తెలిసికోవాలని. సమర్థులైన గురుదేవులు ఇచ్చిన మహాప్రసాదాన్ని అందరం కలసి పంచుకుంటున్నాము. అందరం కలసి అనుభవిస్తున్నాము. మధ్యలో విషయాదులు లేవు. తత్త్వాన్వేషణలో ఎవరికి వారే యమునా తీరే. చేయి పని కాలు చెయ్యదు, మనలోనే ఉన్నై శత్రువులు. కుక్కకాటుకు చెప్పు దెబ్బ. మన జీవితంలో చాల కానివి తటస్థ పడుతున్నై. మనం తలవంచుతున్నాము. సాగినంత కాలం నా అంతవాడు లేడు. సాగక పోతే ఊరక చతికిలపడుదురు. మత్తువదలరా నిద్దుర

మత్తువదలరా! మన ఇంద్రియాలన్నీ వాణ్ణి ఆనుకొని ఉన్నై. అందువలన

**పంచ పంచ హృషీకదేహ మనశ్చతుష్క పరస్పరం**
**పంచభూత సకామషట్క సమీర శబ్ద ముఖేతరం**
**పంచకోశ గుణత్రయాది సమస్త ధర్మ విలక్షణం**

అందుకనే ఉన్నాము. ఇక తరువాతవి జరగాలి. అందుకని ఎక్కడ మత్తు వస్తుందో అని

**మత్తువదలరా నిద్దుర మత్తు వదలరా!**
**ఆ మత్తులోన పడితే గమ్మత్తుగ చిత్తౌదువురా ॥మత్తు॥**
**జీవితమున సగభాగమ్ము నిద్దురకే సరిపోవు**
**మిగిలిన ఆ సగభాగమ్ము చిత్త శుద్ధి లేకపోవు**
**అతినిద్రా లోలుడు తెలివిలేని మూర్ఖుడు**
**పరమార్థంకానలేక వ్యర్థంగా చెడిపోతాడు ॥మత్తు॥**

**సాగినంతకాలం నా అంతటివాడు లేడందురు. సాగకపోతే ఊరక చతికిల బడిపోదురు. కండబలంతో............**

మత్తు అంటే ఏ మత్తు. అది నిద్రమత్తుకాదు. ఉత్కృష్టమైన మానవ జన్మకు వచ్చి, తనను తాను గుర్తించకుండా, ఇతరములపై చింత. నిద్ర లేచింది మొదలు విశ్రమించే వరకు కొమ్మలపై చింత, కూరగాయల చింత, కూటి చింత.... ఇన్ని చింతలలో పడి భగవచ్చింతన చేయలేక పోతున్నారు. దీంట్లోనించి బయటకు తీసేవారు గురుదేవులే. ఇది తెలియక పోవటం ఒక మత్తు. ఈ జీవితానికి వచ్చినందుకు సార్థకత ఏమిటో తెలియడం లేదు. అది మత్తు. ఆ మత్తు వదలాలి. ఆ మత్తునుండి బయట పడాలి. అసలు నీవెవరవో తెలుసుకోకుండా సగభాగం నిద్రలో గడపటానికి, చిత్తశుద్ధి లేకుండా ఉండటానికి కాదు ఈ జీవితం వచ్చింది. నిన్నటిది మరచిపోవాలి. రేపటిది గుర్తు రాకూడదు. ఇప్పటి సంగతి ఆలోచించాలి. కాని అలా చెయ్యటం లేదు. వాడు ఇల్లు కట్టాడు నేను కట్టలేదు. వాళ్ళ అమ్మాయికి పెళ్ళి అయింది. వాళ్ళ అబ్బాయికి ఉద్యోగం వచ్చింది, మావాడికి రాలేదు. వాడు ముందుకు పోతున్నాడు వంటివే ఆలోచిస్తాము. నీ ఆలోచనలలో, భోగభాగ్యాలలో, ప్రవృత్తులలో మార్పు ఉన్నది కాని లోపల ఉన్నదాంట్లో మార్పు లేదు. అది అమ్మ. నిజ జాగ్రత్త తనను తానుగా గుర్తించటం. దానికి ఏ విషయాలు అడ్డు వచ్చేలా చేసుకోకూడదు. వాటి వెంట పడకూడదు. వాటిని సాగదీస్తే, నీ జన్మ అయిపోయి, అది జన్మలకు కారణం అవుతుంది.

-సశేషం

# మాతాజీ సత్సంగ్ డైరీ

-రమణ ప్రసాద్

(గతసంచిక తరువాయి)

ఈ అమ్మ విషయంలో కూడ అలా జరిగింది. 1963లో మా తండ్రిగారు గురు సాయుజ్యం పొందారు. సంవత్సరం, రెండు సంవత్సరాల తరువాత శ్రీ గురుదేవులు ఉత్తరదేశయాత్ర వేశారు. బదరీ వద్ద, రైలులో ఉండగా ఈ అమ్మ ప్రాణం పోయింది. ఋషీకేశ్‌లో రైలు ఆగగానే మా తల్లిగారు నా దేహాన్ని ప్లాట్‌ఫామ్(platform) మీద ఉన్న భక్తుల చేతికి ఇచ్చి, బాబుకు ఇవ్వండి అని పంపిచారు. బాబు అంటే పెద్దవారని ఒక అర్థం. చిన్న పిల్లవాడని ఇంకొక అర్థం. అందరికీ అందేవాడు బాబు. అందరికీ అందనివాడు భగవంతుడు ఎలా అవుతాడు? చెప్పింది చెప్పినట్లు చేస్తే, ఆయన చెప్పిన మార్గంలో నడిస్తే ఆయన దొరుకుతాడు. లేకపోతే దొరకడు. మహాత్ములందరూ ఉపాధులు వేరైనా తత్త్వతః ఒకటే. ఇడ్లీ పిండితో ఇడ్లీ చేశారు. అదే పిండితో దోసె చేశారు. ఇడ్లీ అన్నా, దోసె అన్నా, పిండి అదే కదా.

డాక్టర్లను పిలిపించారు. వారు వచ్చి చేయిచూసి వదిలేసి ముఖాలు చూసుకున్నారు. చివరి సారిగా ఏదైనా ఇంజెక్షన్ ఇచ్చి ప్రయత్నించండి అని వారిని బ్రతిమిలాడారు. వారు ఇంజెక్షన్ గుచ్చి, మందు లోపలికి ఎక్కటం లేదు, ప్రాణం ఎప్పుడో పోయింది, లాభంలేదని పెదవి విరిచారట. అప్పటికి నాకు తొమ్మిదేళ్ళు. బాబు నన్ను ఒడిలో పడుకోబెట్టుకుని, నుదిటిమీద చేయివేసి ధ్యాన సమాధిలోకి వెళ్ళిపోయారు. డాక్టర్స్ కూడ తమ మందుల బ్యాగ్‌లు ప్రక్కన పెట్టి, ఆయనవైపు ఆశ్చర్యంగా అలా చూస్తూ ఉండిపోయారు. కొంత సేపటికి నాలో మెల్లగా చలనం వచ్చింది. వారు ధ్యాన సమాధిలోనుండి బయటకు వచ్చి 'అమ్మడూ లే' అన్నారు. నేను వెంటనే లేచి కూర్చున్నాను. తరువాత వారు 'హమయ్య! ఇక పరవాలేదు. లేకపోతే ఆ యాత్రలో భర్తను పోగొట్టుకొని, ఈ యాత్రలో కూతురిని కూడ పోగొట్టుకొంటే ఇక ఆ తల్లికి నేను ఏమని సమాధానం చెప్పగలిగే వాడిని?'' అన్నారు శ్రీబాబు.

అనంత శక్తి స్వరూపులు వారు. అటువంటి అనంతశక్తి ఉంటే ఏదైనా చెయ్యవచ్చు. కరెంటు ఉంటే ఎన్ని బల్బులైనా వెలిగించుకోవచ్చు. జుట్టు ఉన్న అమ్మ ఎన్ని ముడులైనా వేసుకుంటుంది. అటువంటి సిద్ధులు, అంటే శక్తి ఉంటే ఏదైనా చేయవచ్చు. ప్రహ్లాద కుమారుడు అటువంటి శక్తి కలవాడు.

మన గురుదేవులు ఎప్పుడూ చెప్తుండేవారు 'భగవంతుణ్ణి నమ్మితే బంగారు పిచ్చుకే, నమ్మకపోతే బూడిదే' అని. బంగారు పిచ్చుక అని ఎందుకన్నారంటే బంగారం అన్నిటికన్న శ్రేష్ఠమైనది కనుక. నమ్మకపోతే బూడిదే. భగవంతుడు మనందరివాడు. మన కొంగు బంగారం. ఎవరైనా భగవంతుడు లేడు అన్నా, అందులో భగవంతుడు అనే పదాన్ని ఉచ్చరించాడు గదా అని భగవంతుడు అతనిని అనుగ్రహిస్తాడు. అసలు భగవంతుడు ఉండబట్టే భగవంతుడు అనేది వచ్చింది. ఆ ఉన్న భగవంతుణ్ణే కొంతమంది లేడు అంటున్నారు. ఉన్నదానినే లేదు అంటున్నారు. అస్తి ఉండబట్టే నాస్తి వచ్చింది. మహాత్ములు చెప్పినది చెప్పినట్లు చేస్తే, చివరకు అది తానుగానే ఉన్నది.

ప్రహ్లాదుడు ఏమన్నాడు? ఇందుగలడందులేడని సందేహము వలదు చక్రి సర్వోపగతుడు అన్నాడు. హిరణ్య కశిపుడు ఒక స్తంభాన్ని చూపిస్తూ అడిగాడు "అయితే ఇందులో ఉంటాడా?" ప్రహ్లాదుడు 'సందేహమెందుకు తప్పక ఉన్నాడు' అని సమాధానం చెప్పాడు. అప్పటికే నారాయణమూర్తి హిరణ్య కశిపుడు ప్రహ్లాదుడితో తనకు ఎక్కడ, ఎందులో చూపమంటాడో అని, హిరణ్య కశిపుడు వరంలో కోరుకున్నట్లుగా, నరసింహావతారం ధరించి, అన్నింట్లోనూ వ్యాపించి సిద్ధంగా కూర్చొని ఉన్నాడు. ఇందుగలడందు లేడని చెప్పిన ప్రహ్లాదుని (తన భక్తుని) మాటను పొల్లు పోనీయకూడదు కదా!

ప్రహ్లాదుడు సందేహమెందుకు అనగానే హిరణ్య కశిపుడు తన గదతో ఆ స్తంభాన్ని గట్టిగా ఒక వేటువేయగానే, వెంటనే ఆ స్తంభం పగిలి అందులో నుండి, హిరణ్య కశిపుడు తనకు ఎవరెవరి చేతిలో మరణం ఉండకూడదు అని వరం కోరుకున్నాడో, అవేవీ కాని నరసింహ రూపంతో బయటకు వచ్చాడు. నరుల చేతిలో, మృగాల చేతిలో చావు ఉండకూడదని కోరుకున్నాడు కదా. నరుడూ కాని, మృగమూ కాని, నరమృగ రూపం ధరించి వచ్చాడు, ప్రహ్లాదుడు ఆశ్రయించిన మనందరి ఆరాధ్య దైవము. వస్తూనే హిరణ్యకశిపుణ్ణి పట్టుకొని లాక్కొని వెళ్ళి, గడపమీద కూర్చొని ఒడిలో పడుకోబెట్టుకున్నాడు. హిరణ్య కశిపుడు ఇంటి లోపలగాని, బయటగాని చావకూడదు, నేలమీద గాని, నీటి మీద కాని చావురాకూడదు అని కోరుకున్నాడు కదా మరి. పైగా ఏ ఆయుధాలతో చావురాకూడదు అని బ్రహ్మ దేవుణ్ణి వరం కోరాడు హిరణ్య కశిపుడు. అందువలన లోపల, వెలుపల కాకుండా గడప మీద, నేల, నీరు కాకుండా ఒడిలో తొడమీద, ఏ ఆయుధం అనటానికి వీలుకాని వజ్రమువంటి

గోళ్ళతో హిరణ్య కశిపుణ్ణి చీల్చి చంపి స్వామి చివరకు ఆ హిరణ్య కశిపుణ్ణి తనలో లయం చేసుకున్నాడు. ఆ ఉగ్రరూపం శాంతించిన తర్వాత ఆయన ప్రహ్లాదుణ్ణి వరం కోరుకో అన్నాడు. ప్రహ్లాదుడికి ఏం వరం కోరుకోవాలో తెలియ లేదు. తనకు ఏ వరమూ అక్కర్లేదన్నాడు. స్వామి "అదేం లాభం లేదు, వరం కోరుకోవలసిందే" అన్నాడు. చివరకు ప్రహ్లాదుడు 'నీవు తప్ప నాకు ఇతరమైన ఏ కోరిక లేకుండా వరం ప్రసాదించు" అని ప్రార్థించాడు. ఇంకేం కావాలి. అన్ని కోరికలు ఆ ఒక్క కోరికలోనే ఉన్నై. వరాలు కోరుకోవటంలో కూడ తెలివి తేటలు ఉండాలి.

ఒక ముసలావిడ తపస్సు చేసింది. అమ్మవారు ప్రత్యక్షమై వరం కోరు కోమన్నది. అప్పటికే ఆమె పండు ముదుసలి అయింది. శరీరం ముడతలు పడింది. ఆమె "నా ముని మనవడిని బంగారు ఊయలలో ఊగిస్తూ, రత్నాలు మణులు తాపిన బంగారు గిన్నెలో పాయసం స్వయంగా తాగించేటట్లు వరం ఇవ్వమని అడిగింది. అడిగింది ఒక్కటే కాని అందులో ఎన్ని తెలివి తేటలో చూడండి. ఎంత ఆయుస్సు, ఐశ్వర్యం ఉంటే అవన్నీ జరుగుతాయి!

మరి మన ప్రహ్లాదుడు దేనిని కోరుకున్నాడు. ఈ జగత్తు కంతటికీ ఏది మూలమై ఉన్నదో, దానినే కోరుకున్నాడు. అప్పుడేకాదు, ఇప్పుడేకాదు, ఎన్ని యుగాలైనా సరే ప్రహ్లాదుడికి జై అనవలసిందే. ఎవరో అడిగారు శ్రీబాబును "ప్రహ్లాదుడు తండ్రి మాట వినలేదు కదా మరి అతనికి పాపం రాలేదా" అని. శ్రీగురుదేవులు సమాధానం చెప్తూ, హిరణ్య కశిపుడు కేవలం దేహాన్ని ఇచ్చిన తండ్రి. కాని గురుదేవుడు అష్టాక్షరీ మహామంత్రాన్నిచ్చారు. అందువలన ప్రహ్లాదుడికి పాపం లేదు. పైగా తండ్రినికూడ తరింప చేసినవాడు అయినాడు. నారాయణమూర్తి అప్పుడే వెతికాడట ప్రహ్లాదుడిలో కాలని బీజాలు ఇంకా ఏమైనా మిగిలి ఉన్నాయేమో అని. ఆ ప్రహ్లాదుడు నారాయణుణ్ణి ఎలా ఆశ్రయించాడు? నద్వితీయోzస్తి కశ్చిత్, నిష్కళంకో, నిరంజనో, నిర్వికల్పో, నిరాఖ్యాత, శుద్ధో దేవ ఏకో నారాయణః అని ఆశ్రయించాడు. ఆయన దేనితోనూ రంజింప బడేవాడు కాడు. ఆయనలో కళంకము, మలాలు లేవు. ఆయనలో సంకల్ప వికల్పాలు, కదలికలు లేవు. స్వయం ప్రకాశుడు. మాటల కందనివాడు. పేరు ప్రతిష్ఠలతో పనిలేనివాడు. పరిశుద్ధమైనవాడు. అటువంటి ఏకో నారాయణుడు ప్రహ్లాద కుమారుణ్ణి అనుగ్రహించాడు.

-సశేషం

# శ్రీ బాబూజీ దివ్యవాణి

భూమండలమునేలిన మేటి మహారాజులు అనేకులు జన్మించిన పరమపావన వంశం ఇక్ష్వాకువంశం. సత్య హరిశ్చంద్రుడు ఈ వంశంలోని వాడే. విశ్వామిత్ర మహర్షికి తానిచ్చిన మాట నిలబెట్టుకొనడం కోసం ఆయన తన భార్యను, కుమారుని, సేవకులుగా ఒక బ్రాహ్మణునికి అమ్మివేయడమే కాక, తానుకూడా ఒక కాటికాపరికి దాసునిగా అమ్ముడు పోయినాడు.

అది అంతటితో ఆగలేదు. అలా ఆ కాటికాపరికి దాసుడై పనిచేసే సందర్భంలో హృదయవిదారకమైన మరొక పని కూడా అతడు చేయవలసి వచ్చింది. బ్రాహ్మణునికి అమ్మివేయబడిన తన కుమారుడు ఆ బ్రాహ్మణుని సేవ కార్య సందర్భంలోనే పాము కాటుకు మరణించగా, అతని దహన క్రియకు మృతకళేబరముతో తన భార్యయే శ్మశానమునకు వచ్చినప్పుడు, కాటి సుంకమును ఆమె నుండి వసూలు చేయుటకు తానే నిర్దాక్షిణ్యముగ పూనుకోవలసి వచ్చినది. కాటిసుంకము చెల్లించుకోలేని తన దీనావస్థ నామె వెల్లడించుకున్నప్పుడు, తమ వివాహ బంధమునకు చిహ్నముగా ఆమె మెడలోనున్న మంగళసూత్రమును సుంకమునకు బదులుగ నీయవలసినదని తానే ఆమెను ఒత్తిడి పెట్టవలసిన దుస్థితిలో పడినాడు.

అవును, ఏది ఏమైనా కర్తవ్యం కర్తవ్యమే. సత్యమనేది భార్యకంటే, ప్రాణం కంటే కూడ పరమ పవిత్రమైనది. ఆహా! సత్యానుష్ఠానమునందు అంతటి అద్భుత పరాకాష్ట . నేటి భారత ప్రజలు ఈ ఒక్క లక్ష్యసాధనమునందు నిష్ఠలగుట నేర్చుకున్నట్లయితే, పూర్వకాలపు సమున్నత కీర్తి స్థాయికి దేశం మరల చేరుకోగలదనడంలో సందేహమా? 'సత్యమేవ జయతే' - సత్యమునకే జయమని గదా వేదం ఎలుగెత్తి చాటుతున్నది.

ఇక్ష్వాకు వంశంలోనివాడే దిలీప మహారాజు. తన గురువుగారి ధేనువును ఒక సింహము కబళించనున్నప్పుడు, ఆ ధేనువునకు బదులుగా తననే అర్పించుకొనుట కతడు వేగిరపడినాడు. కర్తవ్య పరిపాలనా నిష్ఠకూ స్వకీయ ప్రాణత్యాగానికైనా సిద్ధమై ఒక పశువునెడల ప్రదర్శించిన దయాగుణమునకు ఇది మరియొక చక్కని ఉదాహరణ.

ఇక, ఆదర్శ ప్రాయమైన సద్గుణ సంపన్నులగు దశరథ మహారాజు కుమారుల సంగతి చూద్దాము. పెద్దవాడు రాముడు శ్రీమహావిష్ణువుని పది

యవతారములలో ఒక యవతారము. రాజ్య పట్టాభిషేకమునకై తాను ధరించిన దివ్య దుకూలములకు మారుగా జటావల్కలములను ధరించిన వాడై, తానుగాక తన తమ్ముడు భరతుడు రాజ్య మేలుటకు తన సమ్మతిని హృదయపూర్వకముగా ప్రకటిస్తూ, పదునాలుగేండ్లు అరణ్యవాసమునకై ఆయన నిర్గమించినప్పుడు ఆయన వదనంలో మందస్మితం ఎప్పటివలెనే చిందులాడింది. భరతుని తల్లియైన కైకేయికి తన తండ్రి దశరథుడు ఏనాడో యిచ్చిన నోటిమాటను నిలబెట్టడం కోసమే ఆయన చేసిన త్యాగం. త్యాగవీర లక్షణమిది.

రాముని భార్యయైన సీతకు, తన భర్త తన చెంత లేని రాజాంతఃపుర సౌఖ్యములకంటే తన భర్త తోడి వనవాస క్లేశములే ఎక్కువ సుఖదాయకములుగా చూపట్టినది. అందు చేతనే ఆమె ఉత్తమ హిందూ గృహిణి సాంప్రదాయానుసారముగా తన భర్తతో అరణ్యమున కేగినది. అనురాగ హృదయుడగు అన్నగారినీ, పరమ సాధ్వియగు వదినగారినీ తన తల్లిదండ్రులను ప్రేమించిన దానికంటే మిన్నగా ప్రేమించినవాడగుటచే వారికి అంగరక్షకుడుగా మెలగుటకై తానుకూడ వారితో అడవికేగినాడు, లక్ష్మణుడు.

ఇక కైక పుత్రుడైన భరతుడో- త్యాగ విషయమున వీరందరినీ మించిపోయినాడు. సర్వసంసిద్ధముగ తన చేతికి అందివచ్చిన సామ్రాజ్యమును తృణ ప్రాయముగా త్రోసిపుచ్చి, సింహాసనముపై రామపాదుకల నధిష్ఠింపచేసినవాడై రాముడు అడవినుండి తిరిగివచ్చు పర్యంతమూ రాముని ప్రతినిధిగా మాత్రమే ప్రజా పరిపాలనము చేయుటకు అతడంగీకరించినాడు. భరతుని భ్రాతృభక్తి ఇట్లు శిఖరస్థాయి నందుకున్నదని అభివర్ణించారు శ్రీ హనుమత్ కాళీ వరప్రసాద బాబు. *

## గురుమహిమా! గురుమహిమా!

అపార గురుమహిమను మనం అనుభవిస్తున్నాం. శ్రీ గురుదేవులు మనతో ఉండిమనలనునడిపించి మనకు వచ్చే కష్టాలనుండి కాపాడుతున్నారు. మీ అనుభవాలను తత్త్వపరంగా వ్రాసి మాకు ప్రచురణకు సమర్థ సద్గురు ఎడ్రస్‌కు పంపండి

-ఎడిటర్

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - స్వామి విజయేశ్వరానంద ప్రసాద్

రొట్టె, పాలు వచ్చిన తరువాత, అవి తీసుకున్నా వాళ్ళకు కడుపు నిండేది కాదు. రొట్టె, పాలు ఇచ్చే వాళ్ళు శ్రీ బాబు గదిలో వారికోసం తెచ్చినవి ఉంచి, వెళ్ళి పోయేవారు. ఏ సాయంత్రానికో, రాత్రికో, ధ్యానం నుండి బాహ్య దృష్టికి వచ్చాక వాటిని శ్రీ బాబు తీసుకునే వారు. ఒక్కొక్క రోజు వారు లేచే సరికి రొట్టె, పాలు ఉండేవి కావు. తమ రొట్టెలతోను, పాలతోను, కడుపు నిండని 'సాధువు'లెవరో శ్రీ బాబు ధ్యానంలో ఉండటం గమనించి, వారి గదిలో వారి కోసం ఉంచిన రొట్టెలు, పాలు తీసుకొని వెళ్ళి, క్షుద్బాధను తీర్చుకొనేవారు. 'అన్నీ త్యాగంచేసి ఇళ్ళూ వాకిళ్ళూ విడచి వచ్చి, ఇక్కడ తపస్సు చేస్తున్నా



కొంచమైనా ఆకలికి ఓర్చుకోలేని వారు యింత దూరం ఎందుకు వచ్చినట్లు? ఏమి సాధించినట్లు?' అని మాకు అనిపించేది. కాని యీ విషయం శ్రీ బాబుతో చెప్పినప్పుడు వారు 'అది క్షుద్బాధ ప్రభావం నాయనా! అది ఎంత పనైనా చేయిస్తుంది. దానిని జయించాలంటే యెంతో సాధన అవసరం. జగన్మాత వాళ్ళకు అటువంటి సాధన సంపత్తిని ప్రసాదించు గాక!' అని అన్నారు'' పరమ కారుణికులు, విశాల హృదయులు అయిన మహాత్ముల భావనకూ సామాన్యుల భావనకూ అంత తేడా ఉంటుంది!

పశ్చిమ గోదావరి జిల్లా విప్పర్రు గ్రామానికి శ్రీబాబూజీ తమ బాల్యంలో వెళ్ళారు. ఒక క్షత్రియుల ఇంట్లో మజ్జిగ అడిగి తీసుకున్నారు. ఇంటి యజమానురాలికి కడుపులో గడ్డ ఉన్నదని అందరూ అనుకుంటున్నారు కాని అది గడ్డ కాదని, వారికి మగపిల్లవాడు పుడతాడని, 'అంజి' అని అతనికి పేరు పెట్టమని, అతను చాలా గొప్ప డాక్టరు అవుతాడని చెప్పి ఒక యంత్రం ఇచ్చి దానిని పూజలో ఉంచి పూజించుకోమన్నారు. దానిని వారు జాగ్రత్తగా పూజించుకున్నారు. తర్వాత మగపిల్లవాడు పుట్టటం, అతనికి అంజి అని పేరు పెట్టటం జరిగింది. ఆ కుర్రవాడు బాగా చదువుకుని గొప్ప డాక్టరు అయినాడు.

శ్రీబాబు తమ బాల్యంలో ఒకసారి హైదరాబాదులో ఉన్న ఒక ధనవంతుల భవనం ముందు నుంచి వెడుతున్నప్పుడు చక్కని కృష్ణ విగ్రహం ఒకటి ఆ భవనం ముందు కనిపించింది.అనుకోకుండా శ్రీ బాబు ఆ విగ్రహం వంకనే తదేక దృష్టితో చూస్తూ నిలబడి పోయారు. అక్కడ ఆ భవనంలో ఏదో వేడుక జరుగుతోంది. చాలా మంది జనం పాటలు, మాటలతో ఆనంద కోలాహలంగా ఉంది.

ఎందుకోగాని శ్రీకృష్ణ విగ్రహం చూస్తున్న శ్రీబాబు మనస్సులో **"మూలాభావ మిదం జ్ఞాతం। శరీరం నాస్తి కేవలం। స్వప్నే ప్రతీయ మానాని। రూపాని యథా తథా॥"** అనే శ్లోకం మెదిలింది. "ఈ శరీరము, ఈ దారా పుత్రాదులు, ఈ గృహారామాలు, ఈ భోగ భాగ్యాలు ఎంత వరకు నిజం? కలలో ఎన్నెన్ని రూపాలో, ఎన్నెన్ని సంఘటనలో కనిపిస్తాయి. అవన్నీ ఎంత వరకు సత్యమో మెలకువ రాగానే అర్థమవుతుంది. ఈ దృశ్య ప్రపంచమూ అంతే కదా"అని తీవ్రంగా విచారణలో మునిగి ఉన్న శ్రీబాబుకు, భవనం లోపలి నుండి ఒక్కసారిగా ఆర్తనాదాలు, ఆక్రందనలూ వినిపించాయి. ఏమిటా అని విచారిస్తే యింటి యజమాని హఠాత్తుగా గుండెపోటుతో మరణించారని తెలిసింది. "ఓహో! ఈ భవనాలు, ఈ బంధువులు, ఈ భోగభాగ్యాలు అన్నీ ఇప్పటిదాకా అనుభవించిన ఆ యజమానికి, ఇప్పుడు అవన్నీ కేవలం నాస్తి, ఆయన బంధుమిత్రులందరికి ఆయన నాస్తి. సాక్షిగా మురళీగానం చేస్తున్న ఈ బాలగోపాలుడొక్కడే ఎప్పుడూ ఉండే అస్తి. అదే శాశ్వతంగా నిలిచే అందరి ఆస్తి"అనుకుంటూ శ్రీబాబు వెళ్ళిపోయారు.

శ్రీబాబు సాధన నిమిత్తం శ్రీశైలం వెళ్ళినప్పుడు, రాత్రి వేళ స్వామి ఆలయం తలుపులు మూసివేశాక, ఆ ప్రాంగణంలోనే ఏదో ఒక ప్రక్కన కూర్చొని ధ్యానం చేసుకొనే వారు. ఒకరోజు తమ ధ్యానంలో శ్రీ బాబు శ్రీ మల్లికార్జున స్వామిని "స్వామీ! నన్ను ఎక్కడ ఉండమంటారు?" అని అడిగారు. స్వామి "ఇదిగో యిక్కడే నా హృదయంలో ఉండు" అని ఆదేశించినట్లు శ్రీబాబుకు స్ఫురణ కలిగింది.

అప్పటిలో ఆ ఆలయానికి ప్రహరీ గోడ లేదు. ఆవరణ అంతా బట్ట బయలుగా ఉండేది. దొంగలు వచ్చేవారు. క్రూర మృగాలు కూడా సంచరించేవి. కాని శ్రీబాబు నిర్భయంగా తమ ధ్యానంలో తాము మునిగిపోయి ఉండేవారు. ఒకసారి శ్రీబాబు ధ్యానం చేసుకుంటుండగా

దొంగలు వచ్చి, శ్రీబాబుతో "ఎందుకు యిక్కడ ఉన్నావు?" అని అడిగారు. "ఇక్కడ స్వామి సన్నిధిలో ధ్యానం చేసుకుంటే హాయిగా ఉంది. అందుకని కూర్చున్నాను" అని శ్రీబాబు చెప్పారు. "ఒంటరిగా ఈ చీకట్లో కూర్చున్నావు. నీకు భయం లేదా?" అని అడిగారు దొంగలు. శ్రీ బాబు "శ్రీ మల్లికార్జున స్వామి నాకు తోడుగా ఉండగా, నేను ఒంటరిని ఎలా అవుతాను? జగజ్జనని భ్రమరాంబాదేవి ప్రకాశిస్తున్న చోట చీకటి ఎక్కడిది? అమ్మా, నాన్నల దగ్గర ఉండగా నాకు భయమెందుకు?" అని చెప్పారు. శ్రీ బాబు మహాత్ములని గ్రహించి ఆ దొంగలు నమస్కారం చేసి వెళ్ళిపోయారు.

శ్రీ బాబు గుండుగొలను వెళ్ళి శేషగిరిరావుగారికీ, చిరంజీవి రాజుగారికీ యీ విశేషాలను చెబుతున్నపుడు, అక్కడే ఉన్న ఒక కోనసీమ పండితుడు విమర్శనా దృష్టితో శ్రీబాబు వంక చూస్తూ " మీరు ఎవరు? బ్రాహ్మణులా? వేదం చదువుకున్నారా? వివాహం అయిందా?" అని ప్రశ్నించాడు. శ్రీ బాబు "నా విషయం తరువాత మనవి చేసుకుంటాను. తమరెవరో దయచేసి చెప్పగలరా?" అని అడిగారు. "మేము వెలనాటి బ్రాహ్మణులం" అన్నాడు ఆ పండితుడు. శ్రీబాబు "ఆలాగా! తమరు బ్రాహ్మణులని జన్మించగానే తెలిసిందా? లేక మీ తండ్రిగారు చెప్పారా? ఆయనకు ఆ సంగతి ఎవరు చెప్పారు? పుట్టుకతో, మానవునికి తానెవరైనది తెలియదు. పుట్టుకతోనే ఎవరూ బ్రాహ్మణులు కాలేదు. కనుక తమరెవరో తెలుసుకునే ప్రయత్నం చెయ్యండి. అలా తెలుసుకున్నప్పుడు తమలో బ్రాహ్మణత్వం పోయి బ్రహ్మత్వం మిగులుతుంది. అప్పుడు 'నేను' ఎవరో తమరికి తెలుస్తుంది. అసలు తనను తాను తెలుసుకున్నవాడికి మనస్సులో ఈ ప్రశ్నే మిగలదు. ప్రశ్న లేకపోతే ఆన్సరు (జవాబు) కూడా ఉండదు. Question No ; Answer No. (అనేవారు బాబు) ఆన్సరుగా తమరే మిగులుతారు"అని చెప్పారు.

"సాధకుడు గురువు నుండి లక్ష్యార్థమును పొందిన తరువాత నియమిత కాలంలో, నియమిత ప్రదేశంలో, ఏకాంతంగా, ఏకాగ్రతతో, పట్టుదలతో సాధన చేసినపుడే లక్ష్యార్థాన్ని సాధించగలుగుతాడు. పాలను తోడు పెట్టిన తరువాత, కదపకుండా ఉంచితేనే తోడుకుంటుంది. మాటి మాటికి కదిపితే, అది తోడుకోదు. తోడుకున్న తర్వాత పెరుగును కదిపినా కదలదు. అలాగే మనస్సు లక్ష్యార్థముపై స్థిరంగా నిలిచేవరకు ఇటు అటు చలించకుండా లక్ష్యమునందే నిలుపుకోవాలి" అని శ్రీ బాబు చెబుతూ ఉండేవారు.

-సశేషం




(గతసంచిక తరువాయి)

-రమణ ప్రసాద్

"మీరందరూ ప్రయాణానికి సిద్ధం అవండి!" అని దుర్మిలుడు ఆజ్ఞాపించాడు. నేను వస్తున్నాను. కొద్ది సేపట్లో........"

అనుచరుడు అటువెళ్ళగానే దుర్మిలుడు ఒక నిర్ణయం తీసుకున్నాడు. కళ్ళు మూసుకున్నాడు.......... క్షణం కాలం నిశ్శబ్దం..... కళ్ళు తెరిచాడు. అక్కడ ఉన్నది దుర్మిలుడు కాదు ఉగ్రసేనుడు! అతని ముఖంపైన కాపట్యం వెలిబుచ్చే నవ్వు....... తనని ఇప్పుడు పవనరేఖ స్వీకరిస్తుంది... అతను దుర్మిలుడని ఎవ్వరూ గుర్తు పట్టలేరు.........

అతను త్వరితంగా క్రిందకు దిగి సెలయేరు వైపు నడిచాడు...... అతనికి స్నానం చేసి ఉన్న పవనరేఖ కనిపిస్తోంది. ఆమెను ఇంకా దగ్గరగా వెళ్ళి చూడాలి......

స్నానం ముగించి పవనరేఖ సఖులతో మధురమార్గంవైపు త్వరత్వరగా ఒక్కడే నడచివస్తున్న ఉగ్రసేనుని చూసి వెంటనే సిగ్గుపడింది. ఉగ్రసేనుడు ఇంత త్వరగా వస్తాడనీ, అదీ ఒక్కడే వస్తాడని ఎవరూ ఊహించలేదు..... దుర్మిలుడు తెలివైనవాడు.... తాను ఉగ్రసేనుని రూపం ధరించటమే కాదు. ఉగ్రసేనుని లాగా వ్యవహరించాడు.... ఈ స్నాన దృశ్యాన్ని అనుకోకుండా తాను చూచినట్లుగా తాను ఆగి వెనుకకు తిరిగి నుంచున్నాడు....!

పవనరేఖతో వచ్చిన సఖులందరూ లజ్జితలై... వారి వారి వస్త్రాలను తీసుకొని దూరంగా లతా మండపం చాటుగా చేసుకొని పరిగెత్తారు. పవనరేఖ కూడా ఆశ్చర్య చకితురాలైంది... వెంటనే ఒక వస్త్రం శరీరంపైన కట్టుకొని తడిసిన జుట్టును విదిలిస్తూ భర్త వద్దకు వచ్చింది.

"నాథా! చాలా త్వరగా వచ్చేశారే!" అని ప్రేమగా పలకరించింది. దుర్మిలుడు ఏమీ మాట్లాడలేదు... ముఖమైతే మారింది కాని, స్వరం మారదు కదా..... మౌనంగా ఉండటమే ఉత్తమం... తన వద్దనున్న వస్త్రాలతో, తనపై కప్పుకొంటూ, సంకోచంతో బిడియంతో ఉన్న పవనరేఖను అతడు ఒక్కసారిగా

తనవైపు లాక్కొన్నాడు.

పవనరేఖ అతనివైపు చూసింది. వారి మధ్య కామం చెలరేగుతోంది... పతి కనులనుండి కురుస్తున్న కామ విస్ఫులింగాలు ఆమెను కూడా క్షణంలో ప్రజ్వలితం చేశాయి. ఆమె లతలాగా దుర్మిలుని పెనవేసుకుంది.

"ఆహా.... స్వామీ....... ఎంత మధురం......... ఎంత హాయి......." అంటూ పవనరేఖ భారంగా శ్వాస వదులుత్తోంది.... అరవిరిసిన కళ్ళతో ఆమె ఉగ్రసేనుని చూస్తోంది. దుర్మిలుడు ఆమెను పూర్తిగా ఆక్రమించాడు. కాలం స్తంభించి పోయింది.

ఒకటి రెండు నిముషాలు గడిచాయి.... పవనరేఖ ఉలిక్కిపడింది. ఒక్క ఉదుటున మెరుపులాగ లేచి నిలబడింది.... ఇతడు తన పతి అయిన ఉగ్రసేనుడేనా? ఈ రోజు అతనికి ఏమైంది, ఈ విధంగా ఈ విధంగా తనను ఎప్పుడూ కఠోరంగా స్పృశించలేదే. ఆమె ఆశ్చర్యపడింది. ఆర్య ఉగ్రసేనుడికి ఈరోజు ఏమైంది? ఆమెకు అంతా కొత్త కొత్తగా తోచింది. అతను అపరిచితుడు లాగా తోచాడు! కాని.... కాని...... అప్పటికే సమయం మించిపోయింది.

"మీరు..... మీరు....... ఏం చేస్తున్నారు? ఏమైంది మీకు అని ఒగురుస్తూ నిట్టూర్పులతో భయభీత అయి అడిగింది. ఆమె కనులు వ్యాకులతను సూచిస్తున్నాయి.

''ఈ రోజు నేను ధన్యుడనైనాను సుందరీ'' దుర్మిలుడు మొదటిసారిగా మాట్లాడాడు... పవనరేఖకు మిన్ను విరిగి మీదపడి నట్లైంది. మీరు....మీరు... నువ్వు.... ఎవరివి? ఉన్న కొద్ది వస్త్రాలతో తనను తాను పూర్తిగా కప్పుకొనే ప్రయత్నం చేస్తూ అంది. ఆమె వణికి పోతోంది.......

"మనం కలిసి గడిపిన ఈ మధుర క్షణాల స్మరణ నీతో ఎప్పుడూ ఉంటుంది'' అంటూ దుర్మిలుడు నవ్వాడు. "ఇదే నా పరిచయం... ఇదే నా పేరు! నువ్వు నాకు ఇచ్చిన సుఖం..............

''పాపాత్ముడా!'' అంటూ పవనరేఖ కుప్పకూలిపోయింది. "దురాచారీ!.... నువ్వు...... నువ్వు........ నా పవిత్రతను భ్రష్టుపరిచావు...." అంటూ విలపించసాగింది.

"భ్రష్టుపరచటమా?'' అని బిగ్గరగా నవ్వాడు దుర్మిలుడు. "సుందరీ నువ్వు చాలా అమాయకురాలవు! నువ్వు నన్ను నీ పతి ఉగ్రసేనునిగా భావించి

నీ శరీరాన్ని అర్పించావు.... అటువంటప్పుడు నువ్వు ఎలా భ్రష్టురాలవౌతావు? మన ఈ సమాగమం.... ఇది కేవలం యాదృచ్ఛికమైన సంఘటన మాత్రమే సుమా!"

పవనరేఖ కనుల ముందు అంధకారం కమ్మింది. ఆమె అచేతనంగా క్రింద పడిపోయింది. ఆమెకు స్పృహ వచ్చేసరికి ఎదురుగా ఆర్య ఉగ్రసేనుడు, తనతో వనవిహారానికి వచ్చిన సఖులు ఎదురుగా నుంచుని ఉన్నారు. ఆమె శరీరంపై అస్తవ్యస్తంగా ఉన్న వస్త్రాలు, ఆమె భావభంగిమలు చూసినవారు జరిగినది ఏమిటో అర్థం చేసికొన్నారు.

దుర్మిలుడిని ఉగ్రసేనుడిగా భావించి పవనరేఖ జలాశయము నుండి బయటకు వచ్చి అతని వైపు వెళ్ళటంతోనే, సఖులందరూ లతామండపం వైపు వెళ్ళిపోయారు. వారు అక్కడ తమ తమ వస్త్రాలను ధరించారు. కొద్ది సేపట్లోనే వారు మధుర దిశగా వచ్చి ముఖ్య మార్గాన్ని విడిచి కొండ మార్గంగా వస్తున్న ఉగ్రసేనుని అతని అనుచరులను చూశారు. వారిలో భయ విభ్రాంతులు చోటు చేసుకున్నాయి. ఇంతకు ముందే కదా వారు ఉగ్రసేనుడు ఒంటరిగా ముఖ్యమార్గం నుంచి జలాశయంవైపు రావటం చూశారు....... పవనరేఖ తన పతిని సమీపించటం కూడ చూశారు కదా.... మరి ఇప్పుడు ఇదేమిటి? వేరే దిశగ ఆర్య ఉగ్రసేనుడు తన అనుచరులతో వస్తున్నాడే....... ఎంత ఆశ్చర్యం? - ఉగ్రసేనుడు కూడా దాసీల ముఖంలోని భయాందోళనలు గమనించాడు.... పవనరేఖ వారితో లేదని కూడ గమనించాడు... ఆశ్చర్య చకితుడైనాడు... చింతాక్రాంతుడైనాడు. దగ్గరగా వచ్చి దాసీ జనులను ప్రశ్నించాడు.

"క్షమించండి మహారాజా!" ఒక చెలికత్తె నెమ్మదిగా ఇలా అన్నది" ఇంతకుముందేగా మీరు ముఖ్యమార్గంగా జలాశయానికి వచ్చారు. మేమంతా ఈ లతామండపం చాటుకి వచ్చేశాము. పవనరేఖ మీ వద్దకే వచ్చింది కదా!... మరచిపోయారా?1

ఉగ్రసేనుడు స్తబ్దుడైనాడు. ఇప్పుడు ఆ స్త్రీలకు కూడా గుర్తుకు వస్తోంది. పవనరేఖ వద్దకు వచ్చిన ఉగ్రసేనుడి దుస్తులు ఆర్య ఉగ్రసేనుని దుస్తులలాగా లేవు! ఏమిటిదంతా? ఏమైంది?

-సశేషం

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - Guda Siva Rama Murthy,